
aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people."
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
సోమవారం
11-05-2026 సంపుటి : 01 సంచిక :50 పేజీలు : 08 వెల :₹ 5/-
తెలుగు దినపత్రిక

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com



## తెలంగాణలోనూ
# పాగా వేస్తాం

దేశంలో అన్ని రాష్ట్రాలు మాకు సమానమే


### బెంగాల్ ఉత్సాహం కొనసాగిస్తాం

- కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అవినీతి రాజ్యమేనని విసుర్లు
- తెలంగాణలో కూడా అబ్ కీ బార్ బీజేపీ సర్కార్ నేడు వినిపిస్తోంది
- నేటి తరాలు సైతం బీజేపీ సర్కారు పాలన కావాలని కోరుకుంటున్నాయి
- బీజేపీ భారీ బహిరంగ సభ వేదికపై నుంచి ప్రధాని మోడీ ప్రకటన

హైదరాబాద్ మే 10 (మహాప్రభ)
హైదరాబాద్ నగరంలోని ప్రసిద్ధ పరేడ్ గ్రౌండ్స్ మరోసారి రాజకీయ చైతన్యానికి వేదికగా మారింది. వేలాది మంది ప్రజల సమక్షంలో జరిగిన భారీ బహిరంగ సభలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొని దేశ అభివృద్ధి, తెలంగాణ పురోగతి, యువత భవిష్యత్తు, సంక్షేమ పథకాలు వంటి పలు అంశాలపై విస్తృతంగా ప్రసంగించారు. తొలిసారిగా పశ్చిమ బెంగాల్ లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని, బెంగాల్ లో ఎలాంటి ఉత్సాహాన్ని చూశామో, తెలంగాణలో కూడా అదే ఉత్సాహం కనిపిస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఆదివారం తెలంగాణ పర్యటనకు వచ్చిన

-మిగతా 3 లో





## విజయ్..
# అను నేను

### ముఖ్యమంత్రిగా జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకారం

- ఉప్పొంగిపోయిన తల్లిదండ్రులు
- కార్యక్రమానికి హాజరైన రాహుల్ గాంధీ
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన త్రిష
- అభిమానులు, కార్యకర్తలతో కిటకిటలాడిన నెహ్రూ స్టేడియం
- ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్

తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. తమిళ వెట్రి కజగం (టీవీకే) అధినేత జోసెఫ్ విజయ్ ఆదివారం ఉదయం 10 గంటలకు తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం వేదికగా నిలిచింది. విజయ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా, 2013లో అప్పటి ప్రభుత్వం సినీ వేడుకల్లో దళపతి విజయ్‌ని చివరి వరుసలో కూర్చోబెట్టగా.. నేడు అదే స్టేడియంలో తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణం చేయడాన్ని అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు. కార్యక్రమానికి విజయ్ తల్లిదండ్రులు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సహా పలువురు హాజరయ్యారు. టీవీకే కార్యకర్తలు, విజయ్ అభిమానులు పెద్ద ఎత్తున రావడంతో నెహ్రూ ఇండోర్ స్టేడియంలో పండుగ వాతావరణం కనిపించింది. సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకార వేడుకలో నటి త్రిష ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అంతకుముందు శనివారం సాయంత్రం విజయ్ తన మిత్రపక్షాల మద్దతు లేఖలతో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 ప్రకారం విజయ్‌ను ముఖ్యమంత్రిగా నియమిస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. మే 13లోగా అసెంబ్లీలో తన బలాన్ని నిరూపించుకోవాలని గవర్నర్ ఆయనకు సూచించారు.
- చెన్నై

3 లో





## పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి..

- 15 మంది పోలీసులు మృతి..
- ముగ్గురికి గాయాలు

3 లో



## పవన్ కల్యాణ్ నివాసానికి
# ప్రధాని మోడీ

- ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్‌ను పరామర్శించిన ప్రధాని
- పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మోడీ
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష.. కృతజ్ఞతలు తెలిపిన పవన్

అమరావతి: మే 10 (మహాప్రభ)
రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరామర్శించారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ప్రధాని, ఆదివారం జూబ్లీహిల్స్‌లోని పవన్ కల్యాణ్ నివాసానికి ప్రత్యేకంగా వెళ్లారు. ఇటీవల సైనస్ సమస్య కారణంగా పవన్ శస్త్రచికిత్స చేయించుకుని, ప్రస్తుతం ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్‌ను కలుసుకున్న ప్రధాని మోడీ, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, తిరిగి ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టాలని ఆకాంక్షించారు.

-మిగతా 3 లో

## ప్రధాని మోడీ హయాంలో
# అభివృద్ధి గణనీయం

- ఎన్నికలప్పుడే రాజకీయాలు తర్వాత పార్టీలకతీతంగా అభివృద్ధి
- రీజనల్ రింగ్ రోడ్డుకు మూడేళ్ల క్రితం అనుమతి
- సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ, రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు
- 42 రైల్వే స్టేషన్ల ఆధునికరణ : కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి

హైదరాబాద్ మే 10 (మహాప్రభ)
తెలంగాణ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం వర్చువల్ గా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. హెచ్ఐసిసి లో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ భారత ప్రధాని మోడీ చేతుల మీదుగా తెలంగాణలో రూ. 9,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయన్నారు. వరంగల్ లో




పీఎం మిత్ర పార్క్ ప్రారంభోత్సవం జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతానికి శంకుస్థాపన చేశారు.

-మిగతా 3 లో

## టీఎంసీలో అసమ్మతి మమత,
## అభిషేక్ బెనర్జీలపై తిరుగుబాటు



3 లో



## ఈ ఏడాది యథావిధిగా
# ఇంటర్ అడ్మిషన్లు

- పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విలీనంపై సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి
- భాగస్వాములతో విస్తృత సంప్రదింపులు, శాసనసభలో చర్చ తర్వాతే నిర్ణయం
- మెజారిటీ రాష్ట్రాలు 11, 12 తరగతుల విధానం అమలు

హైదరాబాద్ మే 10 (మహాప్రభ)
ఈ ఏడాది యథావిధిగా ఇంటర్మీడియట్ ప్రవేశాలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండడం, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండడంతో విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్ ను రద్దు చేసి సీబీఎస్ఈలో మాదిరి 11, 12 తరగతులు నిర్వహించాలని.. ఫలితంగా డ్రాపౌట్స్ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది.

-మిగతా 3 లో



## తక్షణమే రాష్ట్ర
# హోదా ఇవ్వాలి

- కేంద్రం అలసత్వంతో అత్యంత అధ్వాన్నంగా ప్రభుత్వ రూపం
- పీటీఐతో జమ్ముకాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్ మే 10 (మహాప్రభ)
జమ్మూ కాశ్మీర్‌లోని ప్రస్తుత పరిపాలనా వ్యవస్థ అత్యంత అధ్వానమైన ప్రభుత్వ రూపం"గా ఉందని, పూర్తి రాష్ట్ర హోదా దిశగా తక్షణమే మారాలని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఆయన పీటీఐతో మాట్లాడుతూ జమ్మూ, శ్రీనగర్‌ల మధ్య రాజకీయంగా చీలిక తీసుకురావడానికి కొన్ని స్వార్థపర శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అవి ఇప్పటికే విఫలమయ్యాయని, భవిష్యత్తులోనూ విఫలమవుతాయని చెప్పారు. ఈ రెండు ప్రాంతాల మధ్య ఉన్న భావోద్వేగ అంతరాన్ని తగ్గించేందుకు గతంలో 'దర్బార్ మూవ్'గా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రాజధానిని మార్చే సాంప్రదాయ పద్ధతిని పునరుద్ధరించడం ఒక కీలకమైన వారధి అని ఆయన చెప్పారు. 90 మంది ఎన్నికైన శాసనసభ్యులు ఉన్న ఒక ప్రాంతాన్ని, కేవలం 30 మంది మాత్రమే ఉన్న పుదుచ్చేరి వంటి చిన్న ప్రాంతాలతో సమానంగా చూడటం సరికాదని అన్నారు. రెండు రకాల అధికార నిర్మాణాలు ఉండే ద్వంద్వ అధికార వ్యవస్థ "విపత్తుకు దారితీస్తుందని" తాను గతంలో చెప్పానని గుర్తు చేశారు. "కేంద్ర సేవలు, శాంతిభద్రతలు, పోలీసుల విషయాలపై నేను వాదించడం లేదు. కేంద్ర పాలిత ప్రాంతంగా, ఆ అంశాలు స్వయంచాలకంగా ఎన్నిక కాని ప్రభుత్వ (కేంద్రం) పరిధిలోనే ఉంటాయి. కానీ ఈ సంస్థలు గతంలో ఎన్నికైన ప్రభుత్వ బాధ్యతగా ఉండేవి. అవి అలాగే ఉండాలి," అని అన్నారు. పహల్గామ్

-మిగతా 3 లో


## తెలంగాణపై పెద్ద
# మనసు చూపండి

- ప్రధాని మోడీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి
- దేశాభివృద్ధిలో తెలంగాణ భాగస్వామ్యంపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు
- పీఎంతో కలిసి ఒకే వేదికగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం
- వికసిత్ భారత్‌తో కలిసి నడుస్తామని భరోసా

### రాష్ట్ర అభివృద్ధిలో మోడీ సహకరించాలి

హైదరాబాద్ మే 10 (మహాప్రభ)
తెలంగాణను నంబర్ వన్ చేయడమే మా లక్ష్యం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని, దీనిలో తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల వాటా ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకుందని చెప్పారు. వీటిని సాధించేందుకు, తెలంగాణ అభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సహకారం కావాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ పరిసరాల్లో జరిగిన పలు అభివృద్ధి ప్రారంభోత్సవాల కార్యక్రమంలో మాట్లాడిన రేవంత్ రెడ్డి ఇది

-మిగతా 3 లో




## తిరుచ్చి తూర్పు అసెంబ్లీ స్థానానికి రాజీనామా చేసిన తమిళనాడు సీఎం విజయ్..!



**న్యూఢిల్లీ మే 10 ( మహాప్రభ )**
తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ స్థానాన్ని వదులుకున్నారు. పెరంబూర్ అసెంబ్లీ స్థానాన్ని ఆయన అట్టిపెట్టుకున్నారు. దాంతో తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ స్థానానికి ఆరు నెలల్లోగా ఉప ఎన్నిక నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. తమిళనాడులో మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఏప్రిల్ 23న పోలింగ్ నిర్వహించారు. టీవీకే చీఫ్ విజయ్ తిరుచ్చి ఈస్ట్, పెరంబూర్ రెండు స్థానాల నుంచి పోటీచేశారు. మే 4న వెలువడిన ఫలితాల్లో ఆయన రెండు స్థానాల్లోనూ విజయం సాధించారు.అయితే ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఒక అభ్యర్థి ఒకేసారి రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయవచ్చు. ఒకవేళ ఆ రెండు సీట్లలోనూ గెలిస్తే ఒక దానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు తిరుచ్చి ఈస్ట్, పెరంబూర్ రెండు స్థానాల నుంచి గెలిచిన విజయ్ .. ఏదో ఒక స్థానానికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో ఆయన తిరుచ్చి ఈస్ట్ స్థానాన్ని వదులుకున్నారు. పెరంబూర్ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగాలని నిర్ణయించుకున్నారు.

## పదిహేనేళ్ల బాలికపై బౌద్ధ సన్యాసి అత్యాచారం..

**సహకరించిన తల్లి..!**



**న్యూఢిల్లీ మే 10 ( మహాప్రభ )**
ఓ పదిహేనేళ్ల బాలికను లైంగికంగా వేధించినట్లు శ్రీలంక కు చెందిన 71 ఏళ్ల బౌద్ధ సన్యాసి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో పల్లెగామ హేమరథ ను పోలీసులు అరెస్టు చేశారు. హేమరథ ప్రస్తుతం శ్రీలంకలోని ప్రసిద్ధ ఆలయానికి ప్రధాన భిక్షువుగా ఉన్నారు. హేమరథ అకృత్యానికి బాలిక తల్లే సహకరించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అనురాధపురలోని మేజిస్ట్రేట్ కోర్టు బాలిక తల్లిపైనా అరెస్టు వారెంటు జారీ చేసింది. హేమరథ ఆలయ ఆవరణలో ఒక బాలికను అపహరించి నిర్బంధించినట్లు గత మార్చి నెలలోనే ఫిర్యాదు నమోదైంది. విచారణలో మరిన్ని వివరాలు బయటకు వచ్చాయి. కొలంబోలోని ప్రైవేటు ఆసుపత్రి ఎమర్జెన్సీ యూనిట్‌లో చికిత్స పొందుతుండగా హేమరథనను, బాలిక తల్లిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## కాల్పుల విరమణపై ఇరాన్‌కు అమెరికా తాజా ప్రతిపాదనలు..

- స్పందించిన ఇరాన్

**న్యూఢిల్లీ మే 10 ( మహాప్రభ )**



అమెరికా--ఇరాన్ మధ్య శాంతి చర్చలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. శాశ్వతంగా కాల్పుల విరమణ కోసం ఇరు దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా కాల్పులు విరమణపై ఇరాన్‌కు అమెరికా ప్రతిపాదనలు పంపింది. తొమ్మిది అంశాలతో అమెరికా ప్రతిపాదనలు పంపింది. దీనిపై ఇరాన్ స్పందించింది. మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్తాన్ ద్వారా అమెరికాకు తన అభిప్రాయం తెలిపింది. 14 అంశాలతో ఇరాన్ సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో కాల్పుల విరమణ, శాంతి ఒప్పందం కావాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న యుద్ధాన్ని కూడా ఆపాలని, హార్ముజ్ గుండా నౌకల రవాణాకు తగిన భద్రత కల్పించాలని ఇరాన్ కోరుతోంది. శాశ్వత ప్రాతిపదికన కాల్పుల విరమణ కావాలని డిమాండ్ చేస్తోంది. అలాగే, ఈ ప్రాంతం నుంచి అమెరికా దళాలు పూర్తిస్థాయిలో వైదొలగాలని కూడా కోరుతోంది. అమెరికా--ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అమలవుతున్నప్పటికీ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడి చేస్తోంది. తమ భూతలంపై ఇరాన్ దాడి చేస్తోందని యూఏఈ ఆరోపిస్తోంది. ఇదే సమయంలో తమ దేశంపై దాడులకు దిగితే, తిరిగి ప్రతిదాడులకు వెనుకాడబోమని ఇరాన్ అమెరికాకు వార్నింగ్ ఇచ్చింది. తమ ప్రజల్ని రక్షించుకునేందుకు మళ్లీ దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. తమ నౌకలపై అమెరికా దాడులు చేస్తే తాము కూడా తీవ్రంగా ప్రతిదాడులు చేస్తామని ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది.

## పంజాబ్ మంత్రి అరోరాకు ఏడు రోజుల ఇడి కస్టడీ

**న్యూఢిల్లీ మే 10 ( మహాప్రభ )**



పంజాబ్ పరిశ్రమల మంత్రి సంజీవ్ అరోరాను గురుగ్రామ్ కోర్టు ఏడురోజుల ఇడి కస్టడీకి పంపినట్లు అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మనీలాండరింగ్ కేసులో అరోరా అధికారిక నివాసం సహా పలు ప్రాంతాల్లో దాడులు జరిపిన అనంతరం శనివారం సాయంత్రం ఇడి అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. అరోరాను చండీగఢ్ నుండి రోడ్డు మార్గంలో గురుగ్రామ్ కు తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇడి పదిరోజుల రిమాండ్ కోరగా, గురుగ్రామ్ లోని పిఎంఎల్ ఎ ప్రత్యేక కోర్టు ఏడు రోజుల కస్టడీ విధించింది. ఈ కేసు రాజకీయ ప్రేరేపితమని మంత్రి తరపు న్యాయవాది తెలిపారు. మే 5న ఇడి కేసు నమోదు చేసి, మే 9న అరోరాను అరెస్ట్ చేసిందని అన్నారు.

# ఉత్తర ప్రదేశ్‌లో మంత్రివర్గ విస్తరణ..

- కొత్త మంత్రులుగా ఆరుగురు ప్రమాణ స్వీకారం

**న్యూఢిల్లీ మే 10 ( మహాప్రభ )**
ఉత్తర ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలోని బీజేపీ కూటమి ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణ చేపట్టింది. ఆదివారం ఆరుగురు కొత్త మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజధాని లక్నోలోని జన్ భవన్‌లో ఆరుగురి చేత గవర్నర్ ఆనందిబెన్ పటేల్ ప్రమాణ స్వీకారం చేయించారు. భూపేంద్ర చౌదరి, మనోజ్ పాండే, క్రిష్ణ పాశ్వాన్, కైలాష్ సింగ్ రాజ్‌పుత్, హన్స్‌రాజ్ విశ్వకర్మ, సురేంద్ర దైలర్ మంత్రులుగా ప్రమాణం చేశారు.వీరిలో భూపేంద్ర చౌదరి, మనోజ్ పాండేకు క్యాబినెట్ హోదా దక్కింది. అలాగే, మంత్రివర్గంలో మార్పులు కూడా చేపట్టారు యోగి




ఆదిత్యనాథ్. ఇప్పటికే మంత్రులుగా ఉన్న అజిత్ సింగ్ పాల్, సోమేంద్ర తోమర్‌లకు స్వతంత్ర మంత్రులుగా అవకాశం కల్పించారు. ఉత్తర ప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్ రాజకీయ అవసరాలకు అనుగుణంగా మంత్రివర్గ విస్తరణ చేపట్టి, పలువురికి అవకాశం కల్పించారు. యోగి 2.0లో 2024లో చేపట్టిన మంత్రివర్గ విస్తరణ తర్వాత మళ్లీ మంత్రివర్గాన్ని విస్తరించడం ఇదే మొదటిసారి. ఈసారి మంత్రివర్గ విస్తరణలో కూటమి పార్టీలకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. ఎస్బీఎస్పీ అధినేత ఓం ప్రకాష్ రాజ్‌బార్, ఆర్ఎల్‌డీ నేతలు అనిల్ కుమార్, సునీల్ కుమార్ శర్మ, దారా సింగ్ చౌహాన్‌లకు క్యాబినెట్ పదవులు దక్కాయి. అయితే, ఈ మంత్రివర్గ విస్తరణపై ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ విమర్శలు గుప్పించారు. ఇది కాలక్షేపం కోసం చేసే ప్రక్రియగా అభివర్ణించారు.

# ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగిస్తాం.

- కీలక దశకు చర్చలు..
- వెల్లడించిన రష్యా అధ్యక్షుడు పుతిన్

**న్యూఢిల్లీ మే 10 ( మహాప్రభ )**
నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన రష్యా--ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. త్వరలోనే ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగిస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. రష్యాలోని మాస్కోలో జరిగిన విక్టరీ డే సెలబ్రేషన్స్‌లో పుతిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ యుద్ధంపై కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే ఉక్రెయిన్ యుద్ధం ముగిసే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ యుద్ధం ముగించేందుకు



యురోపియన్ యూనియన్‌తో కూడా చర్చలు జరుపుతానని పుతిన్ వెల్లడించాడు. ఈయూ అండతోనే ఉక్రెయిన్.. రష్యాపై యుద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా యురోపియన్ యూనియన్ (ఈయూ)తో చర్చల కోసం జర్మనీ మాజీ ఛాన్సలర్ గెర్హార్డ్ ష్రోడెర్ పేరును పుతిన్ సూచించారు. ఈ చర్చల ద్వారా ఈయూతో రక్షణ ఒప్పందం కుదుర్చుకుంటామన్నారు. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో కూడా పుతిన్ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌తో కాల్పుల ఒప్పందానికి అంగీకరించారు. అలాగే, రెండు దేశాల మధ్య 1,000 మంది సైనిక ఖైదీల అప్పగింతకు కూడా అంగీకరించారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా, యుక్రెయన్ మధ్య కుదిరిన కీలక ఒప్పందం ఇది. ఈ యుద్ధం 2022, ఫిబ్రవరిలో ప్రారంభమైంది. నాలుగేళ్లైనా ఇంకా యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ యుద్ధంలో రష్యాకు ఉత్తర కొరియా సైన్యం కూడా సహకరించినట్లు ఆరోపణలున్నాయి. తాజాగా మాస్కోలో జరిగిన విక్టరీ పెరేడ్‌లో కొరియా సైనికులు కూడా పాల్గొనడం ఈ ప్రచారానికి బలం చేకూర్చింది.

# కేరళం సీఎం ఎంపికపై కొనసాగుతున్న సస్పెన్స్..

- 80 శాతం మంది ఎమ్మెల్యేల మద్దతు ఆయనకే

**న్యూఢిల్లీ మే 10 ( మహాప్రభ )**
ఇటీవల ఐదు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల ఫలితాలపై ఒక స్పష్టత వచ్చింది. నాలుగు రాష్ట్రాలకు సీఎంల ఎంపిక పూర్తైంది. తమిళనాడు, పదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ సీఎంల ప్రమాణ స్వీకారం పూర్తికాగా.. అసోం సీఎంగా హిమంత ప్రమాణ స్వీకారం 12న జరగనుంది. ఇక మిగిలింది కేరళ. అక్కడ సీఎం ఎంపికపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. సీఎంగా ఎవరిని ఎంపిక చేయాలో కాంగ్రెస్ అధిష్టానం ఇంకా నిర్ణయించుకులేకపోతోంది. కేరళంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూడీఎఫ్ కూటమి అధికారం దక్కించుకున్న సంగతి తెలిసిందే. అధికార ఎల్డీఎఫ్‌ను ఓడించి, అధికారం దక్కించుకుంది. 140 అసెంబ్లీ సీట్లున్న కేరళంలో యూడీఎఫ్ కూటమి 102 సీట్లు గెలుచుకుంది. అధికార ఎల్డీఎఫ్ కూటమికి 35 సీట్లు దక్కాయి. ఇక యూడీఎఫ్‌లో అత్యధిక సీట్లు దక్కింది కూడా కాంగ్రెస్ పార్టీకే. దీంతో కాంగ్రెస్ పార్టీకే సీఎం పదవి అందుతుంది. అయితే, సీఎంగా ఎవరిని



ఎంపిక చేయాలనే విషయంలో ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ప్రధానంగా కాంగ్రెస్ ఎంపీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు వినిపిస్తోంది. ఆయన సీఎం రేసులో ముందున్నారు. తన సీఎం పదవి కోసం ప్రయత్నిస్తున్నారు. ఆయన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడు. పైగా ఆయన రహస్యంగా రాహుల్‌ను కలిసి సీఎం పదవిపై చర్చించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక, ఇటీవల గెలిచిన ఎమ్మెల్యేల్లో 80 శాతం మంది వేణుగోపాల్ వైపే మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ఆయనతోపాటు వీడీ సతీషన్, రమేష్ చెన్నితల పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి. ఈ ముగ్గురూ తాజాగా ఢిల్లీలో కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. సీఎం ఎంపికపై ఈ ముగ్గురితో ఖర్గే, రాహుల్ గాంధీ వంటి కాంగ్రెస్ అగ్రనేతలు మూడు గంటలపాటు చర్చించినట్లు సమాచారం. అయినప్పటికీ ఏ నిర్ణయం తీసుకోలేదు. అయితే, సీఎం పదవి కోసం చేస్తున్న ప్రయత్నాల్ని రాహుల్ గాంధీ తప్పుబట్టారు. ఎవరి లాబీయింగ్ వారు చేసుకోవడం వల్ల చివరకు పార్టీకి నష్టం జరుగుతుందని రాహుల్ అభిప్రాయపడ్డట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. నేతలు అందరి మద్దతు కూడగట్టుకోవాలని, విభజన రాజకీయాలు మానుకోవాలని సూచించారు. వేణుగోపాల్, సతీష్, రమేష్.. ఈ ముగ్గురిలో ఎక్కువ మంది ఎమ్మెల్యేల మద్దతు వేణుగోపాల్‌కు ఉన్నట్లు తెలుస్తోంది. ఆయనకు 45 ఎమ్మెల్యేలు మద్దతిస్తున్నారు. సీఎం పదవికి ఎంపిక చేయడం వల్ల పార్టీలో ఇబ్బందులు రాకూడదని అధిష్టానం భావిస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం ఎంపిక ప్రక్రియ ఆలస్యమవుతోంది. త్వరలోనే కాంగ్రెస్ అధిష్టానం దీనిపై ఒక నిర్ణయం తీసుకునే వీలుంది.

## మాతృ దినోత్సవం రోజు దారుణం..

- తల్లి, తమ్ముడ్ని కాల్చి చంపిన వ్యక్తి

**లక్నో**
**మే 10 ( మహాప్రభ )**



మాతృ దినోత్సవం రోజున ఒక వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడు. కన్న తల్లితోపాటు తమ్ముడ్ని తుపాకీతో కాల్చి చంపాడు. ఆ తర్వాత ఇంటి నుంచి పారిపోయాడు. పోలీసులు ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బందా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. రాజ్‌కిషోర్ గుప్తా కుటుంబానికి చెందిన పూర్వీకుల ఆస్తిని తండ్రి అమ్మాడు. దీని గురించి అతడు ఆగ్రహంతో ఉన్నాడు.కాగా, ఆదివారం తెల్లవారుజామున ఆ భూమి అమ్మకంపై తల్లి, తమ్ముడితో రాజ్‌కిషోర్ గొడవ పడ్డాడు. ఆగ్రహించిన అతడు గన్‌తో వారిపై కాల్పులు జరిపాడు. మాతృ దినోత్సవం రోజున కన్న తల్లితోపాటు సోదరుడ్ని హత్య చేశాడు. ఆ తర్వాత ఇంటి నుంచి పారిపోయాడు. మరోవైపు కాల్పుల శబ్దాలకు స్థానికులు ఉలిక్కిపడ్డారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఆ ఇంటికి చేరుకున్నారు. రక్తం మడుగుల్లో పడి ఉన్న మహిళ, ఆమె కుమారుడ్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే వారు మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. ఫోరెన్సిక్ బృందాన్ని రప్పించి ఆ ఇంటి నుంచి ఆధారాలు సేకరించారు. నిందితుడు రాజ్‌కిషోర్ అరెస్ట్ కోసం నాలుగు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## ప్రధాని పర్యటన వేళ బెంగళూరులో జిలెటిన్ స్టిక్స్ కలకలం..!

**న్యూఢిల్లీ మే 10 ( మహాప్రభ )**



కర్ణాటక రాజధాని బెంగళూరు లో ఆదివారం బీజేపీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ప్రధాని సమావేశానికి హాజరుకావడానికి ముందు వేదికకు మూడు కిలోమీటర్ల దూరంలోని కగలిపుర లో రెండు జిలెటిన్ స్టిక్స్ లభ్యమైనట్లు పోలీసులు వెల్లడించారు. బాంబు నిర్వీర్వ దళాలు వాటిని అక్కడి నుంచి తరలించినట్లు తెలిపారు.కాగా ఆ జిలెటిన్ స్టిక్స్‌ను అక్కడ పెట్టినట్లు భావిస్తున్న ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. దాంతో అధికారులు అప్రమత్తమై ఆ ప్రాంతంలో విస్తృత సోదాలు నిర్వహించారు. ప్రధాని మోదీ వేదిక వద్దకు చేరుకోవడానికి ముందు ఆయన కాన్వాయ్ వచ్చే మార్గంలో నిర్వహించిన సాధారణ భద్రతా తనిఖీల్లో ఈ జిలెటిన్ స్టిక్స్‌ను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

# విజయ్.. అను నేను



– చెన్నై,
టీవీకే చీఫ్ విజయ్ ప్రమాణస్వీకార కార్యక్రమం అశేష జనసందోహం నడుమ జరిగింది. 'విజయ్ అనే నేను..' అంటూ ఆయన తమిళనాడు ముఖ్యమంత్రి గా ప్రమాణస్వీకారం చేశారు. ఆ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ .. విజయ్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం లో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ తదితరులు హాజరయ్యారు. సరిగ్గా ఉదయం 10.30 గంటలకు విజయం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి విజయ్ అభిమానులు, టీవీకే కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దాంతో స్టేడియం అంతా సందడి నెలకొన్నది. ఈ కార్యక్రమంలో సినీనటి త్రిష కూడా మెరిశారు. ఆమె ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇక విజయ్‌తోపాటు మరో తొమ్మిది మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో ఏడుగురు టీవీకే ఎమ్మెల్యేలు, ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో ఒక మహిళ కూడా ఉన్నారు. వామపక్షాలు క్యాబినెటల్‌లో చేరేందుకు నిరాకరించడంతో వారి మంత్రివర్గంలో చోటుకల్పించలేదు. మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఎన్ ఆనంద్, ఆదవ అర్జున, కేఏ సెంగోటియన్, ఎస్ కీర్తన, కేజీ అరుణ్ రాజ్, పీ వెంకటరమణన్, సీఆర్ నిర్మల్ కుమార్ ఉన్నారు. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకుగానూ విజయ్ పార్టీ 108 స్థానాల్లో గెలుపుతో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచింది. కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు కూడగట్టి.. విజయ్ ఇవాళ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు స్టేడియానికి చేరుకున్న గవర్నర్ అర్లేకర్‌కు విజయ్ శాలువా కప్పి స్వాగతం పలికారు.

## పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి..

-15 మంది పోలీసులు మృతి..
- ముగ్గురికి గాయాలు



**న్యూఢిల్లీ**
పాకిస్తాన్‌లో భారీ ఆత్మాహుతి దాడి జరిగింది. బన్ను ప్రాంతంలోని ఒక పోలీస్ చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి జరిగిన ఆత్మాహుతి దాడిలో 15 మంది పోలీసులకు మరణించారు. మరో ముగ్గురికిపైగా గాయపడ్డారు. అంతర్జాతీయ మీడియా కథనం ప్రకారం.. బన్ను ప్రాంతంలోని ఫతే ఖేల్ పోలీస్ చెక్‌పోస్టు వద్దకు పేలుడు పదార్థాలతో కూడిన ఒక వాహనం శనివారం రాత్రి దూసుకొచ్చింది. ఆ వెంటనే పేలుడు జరిగింది. ఈ ఘటనలో అక్కడ విధులు నిర్వహిస్తున్న 15 మంది పోలీసులు మరణించారు.వాహనంలో పేలుడు పదార్థాలు భారీగా ఉండటంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంది. చాలా మంది పోలీసులు చాలా దూరం ఎగిరిపడ్డారు. కొందరు పోలీసులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారి మృతదేహాల్ని బయటకు తీశారు. ఈ ఘటనతో అక్కడి నిర్మానం పూర్తిగా కూలిపోయింది. గాయపడ్డవారిని స్థానిక ఆస్పత్రులకు తరలించారు. రాత్రంతా సహాయక చర్యలు చేపట్టినట్లు స్థానిక డీఐజీ సజ్జాద్ ఖాన్ తెలిపారు. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఆత్మాహుతి దాడిలో పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో చుట్టుపక్కల చాలా దూరం వరకు నివాసాలు, ఇతర బిల్డింగులు కూడా ధ్వంసమైనట్లు పోలీసులు తెలిపారు. కొన్ని చోట్ల పేలుడు తీవ్రతకు ఇంటి పైకప్పులు కూడా కూలిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సహాయక చర్యలు చేపడుతుండగా, ఉగ్రవాదులు మళ్లీ దాడి చేసే అవకాశం ఉందన్న భయంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో భారీ స్థాయిలో పోలీసుల్ని మోహరించినట్లు చెప్పారు. ఈ ఘటనను స్థానిక నేతలు ఖండించారు. మరోవైపు తాము పది చోట్ల దాడులకు పాల్పడినట్లు బలూచిస్తాన్ లిబరేషన్ ఫ్రంట్ సంస్థ ప్రకటించుకుంది.

## పవన్ కల్యాణ్ నివాసానికి ప్రధాని మోడీ

మొదటి తరువాయి
తన కోసం స్వయంగా ఇంటికి వచ్చి పరామర్శించడం పట్ల పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీకి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పవన్‌ను పరామర్శించిన అనంతరం, ప్రధాని మోడీ జూబ్లీహిల్స్‌లోనే ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి వెళ్లారు.

## ప్రధాని మోడీ హయాంలో అభివృద్ధి గణనీయం

మొదటి తరువాయి
రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ ఆర్ ఆర్) ఈ ప్రాజెక్టుకు మూడేళ్ల క్రితమే కేంద్రం అనుమతి ఇచ్చింది. భూసేకరణ ప్రక్రియ ముగిసి, కేంద్ర కేబినెట్ ఆమోదం లభించగానే పనులు ప్రారంభమవుతాయన్నారు. 2014 వరకు తెలంగాణలో 2,400 కి.మీ జాతీయ రహదారులు ఉండగా, గత 11 ఏళ్లలో అదనంగా 2,600 కి.మీ కొత్త హైవేలను కేంద్రం నిర్మించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 42 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రూ. 220 కోట్ల వ్యయంతో ఈ స్టేషన్ ను శంషాబాద్ ఎయిర్ పోర్ట్ స్థాయి అత్యాధునిక సదుపాయాలతో ఈ ఏడాది చివరికల్లా సిద్ధం చేస్తున్నారన్నారు. ఇటీవలే చర్లపల్లి రైల్వే స్టేషన్ ను కూడా అందుబాటులోకి వచ్చిందన్నారు. కీలక సంస్థలు అండ్ ప్రాజెక్టులు రాష్ట్రంలో సమ్మక్క-సారక్క సెంట్రల్ యూనివర్సిటీ, రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్, ఎయిమ్స్ ఆసుపత్రి వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు కొనసాగుతున్నాయన్నారు. గతంలో ప్రారంభించిన రామగుండం ఫర్టిలైజర్ పరిశ్రమ రూ. 13,000 కోట్ల ఎన్టీపీసీ పవర్ ప్రాజెక్టులను కేంద్రం తెలంగాణకు అందించిందన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా (బిఆర్ఎస్, కాంగ్రెస్ లేదా కమ్యూనిస్ట్) కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపకుండా తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత రాజకీయ భేదాలు పక్కన పెట్టి రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ ఆశయమైన 2047 నాటికి భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో తెలంగాణ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.

# తెలంగాణలోనూ పాగా వేస్తాం

మొదటి తరువాయి
ప్రధాని మోడీ పరేడ్ గ్రౌండ్స్ లో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. 'నా ప్రియమైన తెలంగాణ ప్రజలారా' అంటూ తెలుగులో ప్రధాని తన ప్రసంగాన్ని ప్రారంభించారు. బెంగాల్ ప్రజలు మమతా బెనర్జీ, లెఫ్ట్ పార్టీలను తిరస్కరించారని ఆయన అన్నారు. మమత నియంతృత్వం నుంచి బెంగాల్ విముక్తమైందని అన్నారు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అవినీతి రాజ్యమేలుతుందని ప్రధాని మోడీ విమర్శలు చేశారు. అబ్ కీ బార్ బీజేపీ సర్కార్ తెలంగాణలో కూడా వినిపిస్తోందని చెప్పారు. తెలంగాణ యువత ప్రేమను నా కళ్లతో చూస్తున్నాని అన్నారు. ప్రధాని మోడీ ప్రసంగం ద్వారా అభివృద్ధి, సంక్షేమం, జాతీయత అనే అంశాలను ప్రజల ముందుకు తీసుకురావడానికి ప్రయత్నించారు. తెలంగాణలో బీజేపీ సర్కార్ వస్తుంది! రాజకీయాల్లో గెలుపోటములు సహజమని ప్రధాని మోడీ, పశ్చిమ బెంగాల్ లో ఓడిపోయింది రాజకీయ పార్టీ కాదని, రాజ్యాంగ వ్యతిరేక శక్తులని అన్నారు. పశ్చిమబెంగాల్ లో అవినీతి, కుటుంబ పార్టీలను ప్రజలు ఓడించారని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఇంత ప్రేమ చూపించడం తన అదృష్టమన్నారు. దేశం మొత్తం మార్పును కోరుకుంటోందని ప్రధాని, ఏ రాష్ట్రంలోనైనా కుటుంబ పాలనను ప్రజలు కోరుకోవట్లేదని పేర్కొన్నారు. ఈసారి తెలంగాణలోనూ బీజేపీ సర్కార్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు కూడా కుటుంబ పార్టీలేనని తెలంగాణ అభివృద్ధికి ఎన్డీయే సర్కార్ కట్టుబడి ఉందన్నారు. కర్ణాటకలో బాధపడుతున్నారు. తెలంగాణలో జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్ మంజూరు చేసినట్లు మోడీ ప్రకటించారు. దేశం మొత్తానికి 7 పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్కులు ఇస్తే, అందులో ఒకటి తెలంగాణకు ఇచ్చినట్లు గుర్తు చేశారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్ తో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, బీజేపీ దృష్టి ఎప్పుడూ అభివృద్ధి, ఉపాధి మీద మాత్రమే ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్‌ను గెలిపించినందుకు కర్ణాటక ప్రజలు బాధపడుతున్నారని, తెలంగాణలోనూ అలానే ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ విధానం మొదట ఓట్లు దండుకో, తర్వాత మర్చిపో అన్నట్లుగా ఉందన్నారు. కాంగ్రెస్ పొత్తులు ఎప్పుడూ అభివృద్ధి నిరోధకాలనే ఉంటాయని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో బీజేపీ విస్తరిస్తోందని అన్నారు. పదేళ్ల క్రితం బెంగాల్ లో ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలు ఉండేవారని, ఇప్పుడు 200కు పైగా ఎమ్మెల్యేలు ఉన్నారని అన్నారు. ఒకప్పుడు బీజేపీ కార్యకర్తలు కూడా లేని బెంగాల్ లో ఇప్పుడు



బీజేపీ ప్రభుత్వం వచ్చిందని అన్నారు. ఒకప్పుడు బీజేపీకి ఇద్దరు ఎంపీలు ఉండేవారని, ఒకరు తెలంగాణ వారే అని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పాలనతో తెలంగాణ ప్రజలు విసిగిపోయారని ఆయన అన్నారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ నమ్ముతుందని, దేశ అభివృద్ధిలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. తెలంగాణకు వేల కోట్ల నిధులు ఇస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌కు అన్ని రకాలుగా కేంద్రం అభివృద్ధి చేస్తుందని వివరించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో భారీ మెజారిటీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ దేశంలోని ప్రధాన ఐటీ, స్టార్టప్ కేంద్రంగా అభివృద్ధి చేయడంలో కేంద్రం సహకారం ఉందో అని పేర్కొన్నారు. మెట్రో విస్తరణ, రహదారుల అభివృద్ధి, రైల్వే ప్రాజెక్టులు, డిజిటల్ మౌలిక వసతులపై కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని చెప్పారు. తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు కేంద్రం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన తెలిపారు. "యువత శక్తి భారత భవిష్యత్తు" అని పేర్కొంటూ స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి పథకాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయని వివరించారు.

**పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**
ప్రధాని మోడీ తన ప్రసంగంలో పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఉచిత గ్యాస్ కనెక్షన్లు, పక్కా ఇళ్లు, ఉచిత ధాన్యం పంపిణీ, ఆరోగ్య బీమా వంటి పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజలకు లాభం చేకూరిందని చెప్పారు. "సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్" అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, రైతుల సంక్షేమం కూడా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందించే పథకాలు దేశవ్యాప్తంగా అమలు అవుతున్నాయని, వ్యవసాయ రంగంలో సాంకేతికతను ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు.

**అవినీతి, కుటుంబ రాజకీయాలపై విమర్శలు**
ప్రధాని తన ప్రసంగంలో ప్రత్యర్థి పార్టీలపై కూడా విమర్శలు గుప్పించారు. అవినీతి, కుటుంబ పాలన దేశ అభివృద్ధికి అడ్డంకిగా మారాయని పేర్కొన్నారు. ప్రజల డబ్బును దోచుకునే రాజకీయాలకు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. పారదర్శక పాలన ద్వారానే ప్రజల విశ్వాసం సంపాదించగలమని అన్నారు. దేశ ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయాలను ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, అందుకే దేశవ్యాప్తంగా ప్రజల మద్దతు పెరుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణలో కూడా అభివృద్ధి రాజకీయాలు రావాల్సిన అవసరం ఉందని అన్నారు.

**యువత, మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యం**
ప్రసంగంలో యువత, మహిళా సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. మహిళల భద్రత, విద్య, ఆర్థిక స్వావలంబన కోసం కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం పెంచుతున్నామని తెలిపారు. యువతను ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా ఉద్యోగాలు కల్పించే స్థాయికి తీసుకువెళ్లాలని ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కొత్త పరిశ్రమలు, స్టార్టప్‌లు, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో భారత్ ప్రపంచంలో ముందంజలో ఉందని పేర్కొన్నారు.

**జాతీయత, ఐక్యతపై సందేశం**
దేశ భద్రత, జాతీయతపై కూడా ప్రధాని భావోద్వేగంగా మాట్లాడారు. "దేశం ముందుగా, పార్టీ తర్వాత" అనే భావనతో ప్రతి పౌరుడు పనిచేయాలని పిలుపునిచ్చారు. భారతదేశం ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని, ఇందులో ప్రతి భారతీయుడి పాత్ర ముఖ్యమని అన్నారు. సరిహద్దుల్లో సైన్యం దేశ రక్షణ కోసం అప్రమత్తంగా పనిచేస్తోందని, దేశ భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడదని స్పష్టం చేశారు. "వికసిత్ భారత్" నిర్మాణంలో తెలంగాణ ప్రజలు కీలక భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

**సభ విజయవంతం**
సభా ప్రాంగణం మొత్తం జాతీయ జెండాలు, పార్టీ జెండాలు, నినాదాలతో మారుమోగిపోయింది. ప్రజల ఉత్సాహం సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రధాని ప్రసంగం మొత్తం ప్రజలు ఆసక్తిగా విన్నారు. పలుమార్లు నినాదాలతో సభా ప్రాంగణం మారుమోగింది. యువత, మహిళలు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా నిర్వహించబడ్డాయి. ఈ సభ తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసేలా కనిపిస్తోంది.

# తెలంగాణపై పెద్ద మనసు చూపండి

మొదటి తరువాయి
కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కాదని ఇది వికాస్ ఉత్సవం అన్నారు. ప్రధాని ప్రణాళిక అయిన వికసిత్ భారత్‌తో కలిసి నడుస్తామని, ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయిపోయాయని ఇప్పుడు రాజకీయాలు మాట్లాడాల్సిన పని లేదు అభివృద్ధి గురించే మాట్లాడదామన్నారు. దేశ జనాభాలో తెలంగాణ 3 శాతం వాటా కలిగి ఉందని దేశ జీడీపీకి తెలంగాణ 5 శాతం వాటా ఇస్తోందన్నారు. ప్రధానిది పెద్ద మనసు అని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ అంటుంటారు. తెలంగాణపై కూడా పెద్ద మనసు చూపించాలని విజ్ఞప్తి చేశారు. మోడీపై తెలంగాణ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని దేశాన్ని మోడీ అభివృద్ధి చేస్తున్నారని కానీ తెలంగాణకు తగిన ప్రాధాన్యత లభించడం లేదన్నారు.

**పీఎంఓలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ పెట్టండి:** దేశాభివృద్ధిలో ఆరు మహానగరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, దేశానికి సింహభాగం ఆదాయం ఇస్తున్న ఆరు నగరాలను కేంద్రం ప్రోత్సహించాలని సీఎం



రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ఆరు నగరాల అభివృద్ధి, అనుమతుల కోసం పీఎంఓలో స్పెషల్ టాస్క్ ఫోర్స్, సింగిల్ విండో విధానం కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలన్నారు. తాను ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులతో అనేక సార్లు కలిశానని తాను కలిసి పనుల్లో కొన్ని పనులు అయ్యాయని, మరి కొన్ని పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. వికసిత్ భారత్ కోసం మీరు ఎంత వేగంగా పని చేస్తున్నారో తెలంగాణలో అంత వేగంగా పనులు జరగడం లేదని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైల్, మూసీ, ఫ్యూచర్ సిటీ, రేడియల్ రోడ్లు, హైదరాబాద్ – మచిలీపట్నం పోర్టు కోసం హైవే, రైల్వే లైన్ అంశాలపై కేవలం ప్రధాని మోడీ కేవలం 2 గంటల సమయం ఇవ్వాలన్నారు. మా ప్రతిపాదనలన్నీ మీ ముందు ఉంచుతామని సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు.

**ఒకే వేదికపై ప్రధానితో కలిసి పాల్గొన్న సీఎం:** ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటన ఆదివారం ఉత్సాహంగా జరిగింది. బెంగళూరు నుంచి బేగంపేట విమానాశ్రయంలో ల్యాండ్ అయిన మోడీ అక్కడి నుంచి నేరుగా మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీ ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడ నిర్వహించిన అధికారిక కార్యక్రమానికి ప్రధానితో పాటు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఐసీసీలో ప్రధాని మోడీని సీఎం రేవంత్ రెడ్డి సత్కరించారు. ప్రధానికి రేవంత్ రెడ్డి వెండి నంది విగ్రహాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రూ. 9,377 కోట్ల విలువైన అభివృద్ధి పనులను మోడీ వర్చువల్ గా ప్రారంభించారు.

## టీఎంసీలో అసమ్మతి మమత, అభిషేక్ బెనర్జీలపై తిరుగుబాటు



కోల్‌కతా
పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పరాజయం పాలైన తరువాత ఆ పార్టీలో మునుపెన్నడూ లేని స్థాయిలో అసమ్మతి వ్యక్తం అవుతున్నది. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జి సహా పార్టీ అగ్రనాయకత్వపై సొంత పార్టీ నేతలే తిరుగుబాటుకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్నారన్న కారణంతో శనివారం ముగ్గురు అధికార ప్రతినిధులను ఆరేండ్లపాటు పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. అయినప్పటికీ వారిలోని తిరుగుబాటు ధోరణి తగ్గడం లేదని తెలుస్తున్నది.టీవీ డిబేట్లలో పార్టీ వాణిని బలంగా వినిపించే అధికార ప్రతినిధి రిజు దత్తా 'ఎక్స్' వేదికగా ఓ వీడియో విడుదల చేశారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు సువేందుపై తాను చేసిన అసభ్యకర వ్యాఖ్యలు టీఎంసీ నాయకత్వం ఒత్తిడి, బెదిరింపుల మేరకే చేశానని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు క్రమశిక్షణ సంఘం ముందు హాజరు కావాలని టీఎంసీ ఆదేశించినా ఆయన వెళ్లలేదు. మాజీ క్రికెటర్, మమత క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేసిన మనోజ్ తివారీ సైతం పార్టీ నాయకత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్ కోసం ఒక్కో అభ్యర్థి నుంచి రూ.5 కోట్లు డిమాండ్ చేశారని, తాను అంత డబ్బు ఇచ్చేందుకు నిరాకరించానని తెలిపారు.

## ఈ ఏడాది యథావిధిగా ఇంటర్ అడ్మిషన్లు

మొదటి తరువాయి
సీబీఎస్ఈతో పాటు మెజారిటీ రాష్ట్రాలు 11, 12 తరగతుల విధానాన్ని అనుసరిస్తున్నాయి. మన రాష్ట్రంలో మాత్రం ఇంటర్మీడియట్ విద్య వేరుగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల్లో అత్యధికులు ఆ తర్వాత ఇంటర్మీడియట్‌కు వేరుగా ఉన్న కళాశాలల్లో చేరడం లేదు. అప్పటితో విద్యను నిలిపివేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌ను వేరుగా కాకుండా 11, 12 తరగతులుగా కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గతంలో అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సైతం తన నివేదికలో పేర్కొంది. ఇటీవల ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు నిలిపివేస్తూ అధికారులు ప్రకటన విడుదల చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది .ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, విద్యా శాఖ కమిషనర్ యోగితా రాణాతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. విలీనంతో ముడిపడిన పలు సాంకేతిక సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు. విలీన ప్రక్రియకు సంబంధించి భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై నియమించిన కమిటీ అధ్యయనం చేసి తన నివేదిక సమర్పించాలని సీఎం సూచించారు. అనంతరం శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## తక్షణమే రాష్ట్ర హోదా ఇవ్వాలి

మొదటి తరువాయి
విషాదాన్ని ప్రస్తావిస్తూ... శాంతిభద్రతల విషయంలో ఎన్నికైన ప్రతినిధులను దూరంగా ఉంచడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని చెప్పారు. జమ్మూ కాశ్మీర్ పరిమాణం, విస్తీర్ణత దృష్ట్యా, పరిపాలనకు ఎన్నికైన ప్రతినిధులే పూర్తి బాధ్యత వహించే పాలనా నమూనా అవసరమని చెప్పారు. పరిపాలనా వ్యవహారాల నిర్వహణ నియమాలపై కేంద్రంతో ఉన్న విభేదాలను తగ్గించడంలో గణనీయమైన పురోగతి సాధించినట్లు చెప్పారు. విశ్వవిద్యాలయాలు, షేర్-ఎ-కాశ్మీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, విద్యుత్ అభివృద్ధి సంస్థ వంటి అనేక కీలక సంస్థలు స్వయంచాలకంగా ఎన్నికైన ప్రభుత్వ పరిధిలోకి రావాల్సి ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల ఏకపక్ష తొలగింపులు అసంబద్ధం న్యాయ విచారణ లేకుండా ప్రభుత్వ ఉద్యోగులను కేంద్రం ఏకపక్షంగా తొలగించడం అసంబద్ధంగా, అస్పష్టంగా ఉందని, ఇది న్యాయ సమీక్షలో నిలబడే అవకాశం లేదని అబ్దుల్లా చెప్పారు.


## సంపాదకీయం

# అనాగరికతారంభం




ఇటీవల దేశంలో ఐదు రాష్ట్రాలలో ఎన్నికలు జరిగాయి. ఫలితాలు మే నాలుగున ప్రకటించారు. బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలలో బీజేపీ గెలిచింది. కేరళలో యూడీఎఫ్ విజయం సాధించింది. తమిళనాడులో ఎవరికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజారిటీ రాలేదు. ఇదంతా సాధారణ వార్త. ఎవరెవరు ఎలా గెలిచారు. 'సర్' ప్రభావమేమిటి? ఓటు చోరీ స్టోరీలోకి వెళ్లడంలేదు. ఓటర్ చోరీ గురించి, ఎన్నికలలో డబ్బు, కేంద్ర బలగాలు, ఈ.డి, సి.బి.ఐ. ఎలక్షన్ కమిషన్ పాత్రలే కాక, మతతత్వ విద్వేష పాత్రనూ ఇప్పుడు ప్రస్తావించడంలేదు. వీటన్నింటి ఫలితంగా వచ్చిన రాజకీయ మార్పులు, ఏరకమైన అనాగరికతకు, విధ్వంసానికి, ఫాసిస్టు ఆచరణకు దారితీస్తాయో ఒక్కసారి దేశ ప్రజలు గమనించాల్సిన అవసరం ఉంది. జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత, పశ్చిమ బెంగాల్‌లో మాత్రం బీభత్సకాండ మొదలయింది. ఇక్కడ మొదటిసారి బీజేపీ అధికారంలోకి వచ్చింది. బెంగాల్‌లో ఇంకా కొత్త ప్రభుత్వం పీఠమెక్కనేలేదు. లూటీలు, దహనాలు, దాడులు, విగ్రహాల కూల్చివేతలు, బెదిరింపులు,మూకుమ్మడి దాడులు, కాషాయ జెండాల నీడలో బుల్డోజర్ విధ్వంసాలు రాష్ట్రాన్ని చుట్టుముట్టాయి. బెంగాల్ అనగానే మనకు భారతీయ పునర్వికాస ఉద్యమం మెదలుతుంది. రాచరిక పరిపాలనలు, నియంతృత్వాల తర్వాత ఆధునిక భారతదేశానికి దిశానిర్దేశనం చేసిన, అందుకు బాటలు వేసిన ప్రాంతం బెంగాలు. భక్తికి నూతన నిర్వచనం ఇస్తూ క్రమశిక్షణ, సేవ బోధించిన రామకృష్ణ పరమహంస ఆ నేలనే! అతని శిష్యుడిగా ఎదిగిన ప్రపంచ తాత్వికుడు స్వామి వివేకానంద సామాన్యుని ఆకలి తీర్చని మతాలు నిరర్థకమని సెలవిచ్చింది అక్కడే. అనాదిగా సనాతన హిందూ సంప్రదాయపు అమానవీయ ఆచారం 'సతీసహగమనం'ను నిర్మూలించడం కోసం తీవ్ర కృషి చేసి చట్టం చేయించిన సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్‌రాయ్ జన్మస్థలమది. మహిళా విద్యావ్యాప్తికి, విధవా వివాహ చట్టం కోసం కృషిచేసిన ఈశ్వరచంద్ర విద్యాసాగర్, విప్లవకారుడు, స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన ఖుదీరాం బోస్, సేవకు ప్రతిరూపం మదర్ థెరిస్సా, సాంస్కృతిక రంగ మేధావి, ప్రసిద్ధ రచయిత, నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్, నజ్రుల్ ఇస్లాం, బంకిం చంద్ర ఛటర్జీ, సుభాష్ చంద్రబోస్ ఇలా ఎన్నో పేర్లు సంస్కర్తల, సాంస్కృతిక కార్యకర్తల పేర్లు పేర్కొనవచ్చు. వాళ్ల ఫొటోలకి కాషాయ కుంకుమ నద్దుతూ జై శ్రీరామ్ అంటూ సంఘపరివార్, బీజేపీ ఆ మహనీయులకు రాజకీయ నినాదాల్ని అంటకడుతున్నది. మతపరమైన గుర్తింపునిచ్చే ప్రయత్నం చేస్తున్నది. ఎన్నికల ఫలితం వస్తుండగానే బీజేపీ కార్యకర్తలు ప్రపంచ ప్రజా నాయకుడు లెనిన్ విగ్రహాన్ని కూల్చేశారు. కలకత్తాలోని చిన్న చిన్న వ్యాపారాలు నడుపుకుంటున్న ముస్లింల షెడ్లను బుల్డోజర్‌తో కూల్చేశారు. కూరగాయలు అమ్ముకునే వారి వద్దకు వెళ్లి 'నీ పేరేమిటని' అడిగి, ముస్లిం అయితే విధ్వంసమేనన్నారు. ఒక పిల్లోడు తెల్ల టోపీ పెట్టుకుని బెలూన్లు అమ్ముకుంటుంటే, వాడు ముస్లిం అని బెలూన్లను పగలగొట్టారు. ఆజాద్ హింద్ కాలేజీ బయట బీజేపీ గుంపు విద్యార్థులను బెదిరిస్తూ ఇది మద్రాస్ కాదు, బుర్ఖా కుదరదని వీరంగం సృష్టించింది. భారతీయతకు ప్రతీకగా ఉన్న బెంగాల్ సమాజంలో ఒక కొత్త విధ్వంస ఫాసిస్టు సంస్కృతీ ఆచరణ ఆరంభమవడాన్ని ఈ సంఘటనలన్నీ రుజువు చేస్తున్నాయి. ఇది ఆనాటి దేశ విభజన బీభత్సాన్ని గుర్తు చేస్తున్నాయి. ఈ విధ్వంసమంతా పోలీసుల సమక్షంలోనే జరగడం మనం వీక్షిస్తూనే ఉన్నాము. అంతకుముందు మమతా బెనర్జీ నాయకత్వం టీఎంసీ ఆధ్వర్యాన ఒక గుండా రాజ్యంలా సాగింది. అక్కడ సీపీఐ(ఎం) కార్యాలయాలనే ఆక్రమించుకుని, వందలాది కార్యకర్తలను హతమార్చారు. ఇప్పుడు మరింత అరాచక మతోన్మాద శక్తులు అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు ముఖ్యమంత్రి పీఠం ఎక్కుతున్న సువేందు అధికారి మాట్లాడుతూ "నేను హిందువుల కోసమే పనిచేస్తాను" అని రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన నాయకుడు మాట్లాడటం, ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే కదా! బెంగాల్ ఇప్పుడు అనాగరికుల ప్రయోగశాల అయింది! ఈ అనాగరిక విధ్వంసాలను అడ్డుకోవడానికి ప్రజా ఉద్యమమే శరణ్యం.

# ఖతార్ తీరంలో సరుకు రవాణా నౌకపై దాడి



**దుబాయ్ మే 10 ( మహాప్రభ )**
ఖతార్ తీరంలో ఆదివారం గుర్తు తెలియని క్షిపణి దాడి కారణంగా సరుకు రవాణా నౌకలో మంటలు చెలరేగినట్లు బ్రిటీష్ సైన్యం తెలిపింది. పెద్ద మొత్తంలో కంటైనర్లను తరలిస్తున్న నౌకపై గుర్తు తెలియని డ్రోన్ లేదా క్షిపణి దాడి జరిగిందని, దీంతో నౌకలో మంటలు చెలరేగాయని యునైటెడ్ కింగ్ డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ (యుకెఎంటిఒ)వెల్లడించింది. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే మంటలను ఆర్పివేసిందని యుకెఎంటిఒ పేర్కొంది. ఖతార్ రాజధాని దోహాకు ఈశాన్యంగా 23 నాటికల్ మైళ్ల (43కిలోమీటర్ల)దూరంలో ఈ దాడి జరిగిందని తెలిపింది. ఈ దాడిలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపింది. నౌక గురించిన పూర్తి సమాచారం తెలియలేదని పేర్కొంది.

# కేరళలో మహిళల ఉచిత ప్రయాణానికి సన్నాహాలు..

### మహిళలు, పురుషులకు వేర్వేరుగా టికెట్లు





**న్యూఢిల్లీ మే 10 ( మహాప్రభ )**
కేరళ అసెంబ్లీ ఎన్నికల లో తాము గెలిస్తే రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత రవాణా సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చిన యూడీఎఫ్ కూటమి అధికారం చేపట్టేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో కేఎస్ఆర్టీసీ అధికారులు అప్పుడే సన్నాహాలు ప్రారంభించారు. బస్సుల్లో లింగ ఆధారిత టికెట్ల జారీ వ్యవస్థకు శనివారం నుంచి శ్రీకారంచుట్టారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ టికెటింగ్ మెషీన్ల లో మార్పులు చేశారు. ఈ మార్పుల ద్వారా ఇక నుంచి కండక్టర్లు జారీచేసే టికెట్లతో పురుషులు, మహిళలు, చిన్నపిల్లల సంఖ్య ఎంతో కచ్చితంగా తెలిసిపోతుంది.ఈటీఎంల ద్వారా ఇచ్చే ముద్రిత టికెట్లపై ప్రయాణికుల కేటగిరీ ఉంటుందని అధికారులు తెలిపారు. యూడీఎఫ్ సర్కారు ఏర్పాటై ఎన్నికల హామీ అమలు చేయకముందే చేపట్టిన ఈ కసరత్తుతో రాష్ట్రంలో ప్రతి నిత్యం ఎంతమంది మహిళలు ప్రయాణం చేస్తున్నారన్న దానిపై ఒక అంచనాకు రావచ్చు. దాని ఆధారంగా మహిళలకు ఉచిత ప్రయాణంతో ప్రభుత్వంపై పడనున్న భారం ఎంతో తెలుసుకోవచ్చు. అయితే ఈ టికెట్ల జారీకి రద్దీ సమయాల్లో అదనపు సమయం కేటాయించాల్సి వస్తుందని కొంతమంది కండక్టర్లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

# సీఎం విజయ్ ఆస్తుల విలువ రూ.648 కోట్లు..

### -అసెంబ్లీలో రెండో సంపన్న ఎమ్మెల్యే

**చెన్నై: మే 10 ( మహాప్రభ )**
తమిళనాడు కొత్త సీఎం విజయ్ రూ.648 కోట్ల విలువైన ఆస్తులు కలిగి ఉన్నారు. రూ. 426.20 కోట్ల విలువైన చరాస్తులు, రూ. 222.65 కోట్ల విలువైన స్థిరాస్తులను ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించారు. ఆ రాష్ట్ర అసెంబ్లీలో రెండో సంపన్న ఎమ్మెల్యేగా ఆయన నిలిచారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 184 కోట్ల ఆదాయాన్ని విజయ్ ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన వారిలో అన్నాడీఎంకే ఎమ్మెల్యే లీమారోజ్ మార్టిన్ అత్యంత సంపన్నురాలు. లాల్గుడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన ఆమె రూ.5,863 కోట్ల విలువైన ఆస్తులను ప్రకటించారు.కాగా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 233 మంది అభ్యర్థుల అఫిడవిట్‌లను




'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), ఎన్నికల పర్యవేక్షక సంస్థ అయిన 'తమిళనాడు ఎలక్షన్ వాచ్' విశ్లేషించాయి. దీని ప్రకారం, విజయం సాధించిన 233 మంది అభ్యర్థుల మొత్తం సంపద రూ.11,265 కోట్లు. అంటే ఒక్కో ఎమ్మెల్యే సగటు సంపద సుమారు రూ.48.35 కోట్లు. 2021లో ఒక్కో ఎమ్మెల్యే సగటు సంపద కేవలం రూ. 12.27 కోట్లు మాత్రమే. ఈ లెక్కన గత ఐదేళ్లలో తమిళనాడు ఎమ్మెల్యేల సగటు సంపద దాదాపు నాలుగు రెట్లు పెరిగినట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. మరోవైపు పార్టీల పరంగా పరిశీలిస్తే, ఎన్నికల్లో భారీ విజయం సాధించిన అధికార టీవీకేకు చెందిన 107 మంది అభ్యర్థుల సగటు ఆస్తులు రూ. 27.09 కోట్లు. డీఎంకే తరపున గెలిచిన 59 మంది అభ్యర్థుల సగటు ఆస్తులు రూ. 14.34 కోట్లు. అన్నాడీఎంకే తరపున విజయం సాధించిన 47 మంది అభ్యర్థుల సగటు ఆస్తులు రూ. 152.89 కోట్లు. కాంగ్రెస్ తరపున గెలిచిన ఐదుగురు అభ్యర్థుల సగటు ఆస్తులు రూ. 17.81 కోట్లు.

# దేశీయ ఉత్పత్తులే కొనండి..

### -దేశభక్తి అంటే దేశం కోసం చావడం కాదు..
### -ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు

**న్యూఢిల్లీ మే 10 ( మహాప్రభ )**
అంతర్జాతీయ పరిణామాల్ని ఎదుర్కొనేందుకు, దేశ ఆర్థిక స్థిరత్వం కోసం ప్రజలు దేశీయ ఉత్పత్తులే కొనాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. అంతేకాదు, పర్యటనలకు వెళ్లే వారు దేశీయంగానే ప్రయాణించి మన పర్యాటక రంగానికి సహకరించాలని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన సభలో మోదీ పాల్గొన్నారు. ప్రస్తుతం ఇరాన్ యుద్ధం, కోవిడ్ తర్వాతి పరిస్థితులు, చమురు సంక్షోభం వంటి కారణాలతో అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులపై వివరించారు.దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు, ప్రస్తుత సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు దేశ ప్రజలు సహకరించాలన్నారు. ఈ మేరకు ప్రజలకు కీలక సూచనలు చేశారు. "సరఫరా రంగంలో అంతర్జాతీయంగా ఇబ్బందులు ఎదురవుతున్నందున




దీన్ని ఎదుర్కొనేందుకు ప్రజలు ఐక్యంగా సిద్ధం కావాలి. ప్రజలు స్వదేశీ ఉత్పత్తులే వాడాలి. ఇందుకోసం ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలి. దేశం, మాతృభూమికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. దేశభక్తి అంటే దేశం కోసం చావడం కాదు. దేశం కోసం బతకడం. మన విధుల్ని మనం నిర్వర్తించడం. ఇంధన వినియోగాన్ని తగ్గిద్దాం. పెట్రోల్, డీజిల్‌ను జాగ్రత్తగా వాడుకుందాం. ప్రజా రవాణాను వినియోగిద్దాం. వీలైనంతగా ఎలక్ట్రిక్ వాహనాల్ని వాడుదాం. కార్ పూలింగ్ ఎంచుకుందాం. రైల్వే రంగంలో డీజిల్ వినియోగాన్ని తగ్గించాం.ఇంధన వినియోగం తగ్గితే విదేశీ మారక నిల్వలు మిగులుతాయి. అలాగే, ఏడాది పాటు బంగారం కొనుగోలు చేయకుండా ఉంది. బంగారం దిగుమతులు తగ్గితే, విదేశీ మారక ద్రవ్యం పెరుగుతుంది. పండుగలు, శుభకార్యాలకు బంగారం కొనుగోలు చేయడాన్ని వీలైనంతగా తగ్గించుకోవాలి. ప్రస్తుతం మన దేశంలో వంట నూనె కోసం కూడా విదేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. వంట నూనెల ఉత్పత్తిలో మనం తగిన ప్రగతి సాధించాల్సిన అవసరం ఉంది. అలాగే, దేశంలో రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించాలి. అనేక అంశాల్లో దేశం విదేశీ దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇలాగైతే దేశం అభివృద్ధి సాధించలేదు" అని మోదీ సూచించారు.

# చార్టర్ బోటులో భారీ పేలుడు..

### 11 మందికి గాయాలు

**న్యూఢిల్లీ మే 10 ( మహాప్రభ )**
అమెరికా లోని ఫ్లోరిడా రాష్ట్రం లో ఓ చార్టర్ బోటు లో భారీ పేలుడు సంభవించింది. మియామి నగర సమీపంలోని బిస్కేన్ బేలో శనివారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో ఒక చిన్నారితో సహా 11 మంది గాయపడ్డారు. పర్యాటకానికి ప్రసిద్ధి చెందిన హాలోవర్ సాండ్‌బార్ సమీపంలో ఈ ఘటన జరిగింది. 'నాటీ నేబర్స్' అనే 40 అడుగుల పడవలో సుమారు 14 మంది ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ధాటికి బోటులో ఉన్న ప్రయాణికులు గాల్లోకి ఎగిరి నీటిలో పడ్డారు.సమాచారం అందుకున్న వెంటనే మియామి-డేడ్ ఫైర్ రెస్క్యూ, యూఎస్ కోస్ట్ గార్డ్ బృందాలు



ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ప్రమాద తీవ్రత దృష్ట్యా దీనిని 'లెవెల్ 2 మాస్ క్యాజువాలిటీ'గా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో కొందరికి తీవ్రంగా కాలిన గాయాలు కాగా.. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. బోటు ఇంజిన్‌ను స్టార్ట్ చేసే సమయంలో గ్యాస్ లీక్ కావడం వల్లే ఈ పేలుడు జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. బోటు కెప్టెన్ తొందరపడి భద్రతా నిబంధనల ప్రకారం బ్లోయర్లను ఆన్ చేయకుండానే ఇంజిన్ స్టార్ట్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఒక ప్రత్యక్ష సాక్షి ఆరోపించారు. ప్రస్తుతం ఈ ఘటనపై ఫ్లోరిడా ఫిష్ అండ్ వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ కమిషన్ ప్రధాన దర్యాప్తు సంస్థగా వ్యవహరిస్తుండగా.. యూఎస్ కోస్ట్ గార్డ్ కూడా సమాంతరంగా విచారణ జరుపుతోంది. పూర్తి దర్యాప్తు తర్వాతే పేలుడుకు కచ్చితమైన కారణాలు తెలుస్తాయని అధికారులు తెలిపారు.

# విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి.

**-విద్యార్థుల నమోదు పెరగాలి.**
**-జిల్లా కలెక్టర్, ప్రతి మాసింగ్.**

**మెదక్ జిల్లా -10మే (మహాప్రభ )**
99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈ నెల 11వ తేది నుండి 17 వ తేది వరకు జరగబోయే విద్యా వారోత్సవాల ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదివారం ఒక ప్రకటన ద్వారా అధికారులను ఆదేశించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్, మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలలో....విద్యా శాఖ భాగస్వామ్యం కీలకమని, ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలకి అనుగుణంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ వారోత్సవాలలో భాగం గా మొదటిరోజు తేదీ 11న భవిత కేంద్రం మెదక్ సెంటర్ నందు నందు ఎంపిక ఎ యల్ ఐ యం సి ఓ ఎయిడ్స్ అండ్ అపలయన్ క్యాంప్ డిస్టిబుషన్స్ కాబడిన 128 మంది విద్యార్థులకు 9,51,233 రూపాయల విలువైన ఉపకరణాలు అందజేయబడతాయి అని తెలిపారు, మరియు 24రావీ పియం యస్ ఎచ్ ఆర్ ఐ స్కూల్ లలో మరియు కేజీబీవీ చేగుంట(రెసిడెన్షియల్ క్యాంప్) నందు15 రోజుల పాటు ఆర్ట్స్, కల్చరల్, డాన్స్ మ్యూజిక్ తదితర రంగాలలో పిల్లలకు సమ్మర్ క్యాంపులను నిర్వహించుచున్నారు. రెండవ రోజు తేదీ 12వ యస్ యస్ సి ఫలితాల్లో ఫెయిల్ అయిన పదవ తరగతి విద్యార్థులకు కోసం . జడ్ పి ఎచ్



యస్ పాపన్న పేట, నర్సాపూర్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతుల శిబిరం లో ప్రతీ రోజూ అన్నీ సబ్జెక్ట్ ల పైన అడ్వాన్స్ డ్ సప్లమెంటరీ పరీక్షలు అయ్యేంత వరకు పిల్లలకు సులభమైన పద్ధతుల ద్వారా భోధన జరగాలన్నారు మూడవరోజు ఈ నెల 13 వ తేదీన...ప్రతీ నియోజకవర్గ స్థాయి లో సర్పంచ్ లకు , మున్సిపల్ చైర్మన్ మరియు కౌన్సిలర్లకు వర్క్ షాప్ నిర్వహించి ప్రభుత్వ విద్యా శాఖ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలియపరిచి... ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థుల నమోదు పెరిగేల వారి సహకారాన్ని తీసుకోవాలన్నారు నాలుగవ రోజు16 వ తేదీన... ప్రతి పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమము మరియు పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించాలని తెలిపారు.ఐదవ రోజు జిల్లా గ్రంధాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని మండల స్థాయిలో గ్రామస్థాయిలో గల గ్రంధాలయాలలో బుక్ ఎగ్జిబిషన్ నిర్వహించాలని తెలిపారు.ఆరవ రోజు తేదీ 16న ఆర్ట్ క్రాఫ్ట్ కల్చర్ డైనింగ్ జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహించాలని తెలిపారు

గెలుపొందిన విద్యార్థులను సన్మాన పత్రాల ద్వారా సన్మానించాలని తెలిపారు అలాగే రాష్ట్రస్థాయిలో పాల్గొనేలా ప్రోత్సహించాలని తెలిపారు.ఏడవ రోజు ఈ నెల 17 వ తేదీన జరిగే విద్యా వారోత్సవాల ముగింపు సమావేశం లో ౦౦౩ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన టాప్ 3 అలాగే ఇంటర్మీడియట్ లో టాప్ 3 మార్క్స్ సాధించిన విద్యార్థులకు, జిల్లా స్థాయి లో క్రీడల్లో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు 10 వేల రూపాయల నగదు పురస్కారం తో పాటు సన్మానం కూడా చేయాలనీ కలెక్టర్ తెలిపారు.వారం రోజుల కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు ఇప్పటికే విధి విధానాలు వచ్చినందున దాని ప్రకారం ముందుకెళ్లాలన్నారు. జిల్లా లోని ఏదైనా పాఠశాల లో కావలిసిన మౌలిక వసతులు ఉంటే తమ దృష్టి కి తీసుకరావాలన్నారు.జిల్లా కేంద్రం నుంచి కావలిసిన సంపూర్ణ సహకారం అన్నీ కార్యక్రమాలకి ఉంటుందని, క్షేత్ర స్థాయిలో ఏ అవసరం ఉన్న, ఏ సమస్య ఉన్న తమ దృష్టికి సరియైన శాఖ ద్వారా తెలియపరిస్తే 100% వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

**-మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**



**పాపన్నపేట, మే 10 ( మహాప్రభ )**
రైతులకు అండగా ఉంటామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు స్పష్టం చేశారు. ఆదివారం పాపన్నపేట లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ధాన్యాన్ని పరిశీలించారు. తరుగు ఎక్కువగా తీసుకుంటున్నారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో,నిర్వాహకులతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి..

**-పాపన్నపేటలో కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**
**-రైస్ మిల్లర్లతో ఫోన్లో మాట్లాడి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే.**



**మెదక్ జిల్లా -10మే, (మహాప్రభ )**
ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సూచించారు.ఆదివారం సాయంత్రం పాపన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు.కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్లర్లు ఇబ్బందులు పెడుతున్నారని స్థానిక నాయకులు, రైతులు ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి పలువురు రైస్ మిల్లర్లతో ఫోన్లో మాట్లాడారు.రైతులకు ఇబ్బందులు లేకుండా మిల్లుకు వచ్చిన వెంటనే ధాన్యాన్ని ఖాళీ చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని రైస్ మిల్లర్లకు సూచించారు.రైతులు అధైర్య పడవద్దని పండించిన ప్రతి చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు.అధికారులు ఎప్పటికపుడు కొనుగోలు ప్రక్రియను పరిశీలించాలని సూచించారు.ఎమ్మెల్యే వెంట మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, మండల నాయకులు ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంతప్ప, శ్రీనివాస్, హీరాలాల్, గౌస్, తదితరులున్నారు.

# బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

**-మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.**

**మెదక్ జిల్లా -10మే (మహాప్రభ )**
బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. మదర్స్ డే రోజున హైదరాబాద్‌కు వస్తున్న ప్రధాని మోదీ, మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై సమాధానం చెప్పాలని అన్నారు. మోడీ ప్రసంగం ప్రారంభించక ముందే బండి సంజయ్‌ను పదవి నుంచి తొలగించాలని, లేనిపక్షంలో ప్రజలు ప్రధాని మాటలను పట్టించుకోరని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ




లేకుండా పోయిందని, రేవంత్ రెడ్డి హోంమంత్రిగా పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఒక మైనర్ బాలిక ఎఫ్‌ఐఆర్ నమోదు కోసం గంటల తరబడి పోలీస్ స్టేషన్‌లో వేచి ఉండాల్సి రావడం పోలీసుల వైఫల్యానికి నిదర్శనమన్నారు.మహిళా రిజర్వేషన్ల బిల్లుపై పార్లమెంట్‌లో గొప్పలు చెప్పుకున్న ప్రధాని మోదీ, మహిళలపై జరుగుతున్న నేరాల విషయంలో మాత్రం మౌనం వహిస్తున్నారని విమర్శించారు. బండి సంజయ్ కుమారుడిపై ఆరోపణలు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం వల్ల కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు బయటపడ్డాయని అన్నారు. బాధిత బాలికకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని విమర్శించారు. బండి సంజయ్ కుమారుడిని వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు ఉపయోగపడే ఒక్క మాట కూడా బండి సంజయ్ మాట్లాడలేదని, రేవంత్ రెడ్డి ఆయనను కాపాడుతున్నారని ఆరోపించారు. తెలంగాణపై ప్రధాని మోదీకి ప్రేమ లేదని, విభజన హామీలు ఇంకా అమలు కాలేదని విమర్శించారు.

# కొత్తపేట గ్రామానికి శుద్ధ జలాల వరం



**శివంపేట మే 10 (మహాప్రభ):**
శివంపేట్ మండలంలోని కొత్తపేట గ్రామంలో ఉచిత మంచినీటి ప్లాంట్‌ను ఘనంగా ప్రారంభించారు. రేవ నర్సింహా రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌ను కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి ప్రారంభించారు. గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రతి కార్యక్రమానికి తమ పూర్తి సహకారం ఉంటుందని అన్నారు.ఈ సందర్భంగా రేవ నర్సింహా రెడ్డి సేవలను స్మరించుకుంటూ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా, చింతల వెంకటరామిరెడ్డి, మాధవరెడ్డి, శ్రీధర్ గుప్తా, రమకాంత్ రెడ్డి మరియు సర్పంచులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆహ్వానించి అవమానిస్తారా

**-ఫోటో కాల్ పాటించని రామయంపేట మున్సిపల్ అధికార పక్షం**
**-నా వార్డులో నేను లేకుండానే శంకుస్థాపనలా**
**-10 వ వార్డు .బి ఆర్ఎస్ కౌన్సిలర్ మద్దెల మాధవి రమేష్**



**రామాయంపేట -10మే (మహాప్రభ )**
రామాయంపేటలోని 10 వార్డులో కౌన్సిలర్ కు సమాచారం లేకుండానే రోడ్డు పనులకు డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారని ప్రోటోకాల్ ప్రకారం పట్టించుకోకుండా శంకుస్థాపనలు ఎలా చేస్తారని కౌన్సిలర్ మద్దెల మాధవి రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు పదో వార్డులో సీసీ రోడ్లకు డ్రైనేజీ పనులను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు రామాయంపేట చైర్పర్సన్. కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపనలు చేశారు మాకు ఉదయం 11 గంటలకు ప్రోగ్రాం ఉంటదని మరియు సాయంత్రం ఐదు గంటలకు సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే చే పోగ్రామ్ చైర్మన్ గారు చేయించారని ఈ విషయం వార్డ్ ప్రజల ద్వారా తెలుసుకొని వెళ్లేసరికి శంకుస్థాపనలు చేసి వేను తిరిగారు అన్నారు . ఒక కౌన్సిలర్ గా తన వార్డులో చేపట్టే అభివృద్ధి పనులను ఇలా చేసి అవమానించడం ఏమిటని మరియు మేము టిఆర్ఎస్ పార్టీలో ఉన్నందుకే నా సరైన సమాచారం ఇవ్వరా అని వారు మున్సిపల్ వారిని ప్రశ్నించారు ఇలాంటి పోగ్రామ్ తమకు తెలియకుండా చేస్తే మేము కూడా దీటుగా సమాధానం ఇవ్వాల్సి వస్తుందని వారు హెచ్చరించారు వారు ఇలాంటి పరిస్థితులు అధికార పార్టీ వారికి కూడా ముందు ముందు ఉండడం వారిని ఇలానే అవమానపరిస్తే ఏలా ఉంటుందో ఒకసారి ఆలోచించాలని తమ ఆవేదన వ్యక్తం చేశారు

# మోడీ సభకు గాంధారి బిజెపి పార్టీ శ్రేణులు

**-బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు**

**గాంధారి, మే 10(మహాప్రభ)**
భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తున్న జన ఆగ్రహ సభకు తరలి వెళ్తున్న గాంధారి మండల భారతీయ జనతా పార్టీ మండల శాఖ వాదిరిగా బయలుదేరారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ మండల



అధ్యక్షుడు ఈకొల మధుసూదన్ రావు, జండా ఊపి ప్రారంభించారు. మాజీ మండల అధ్యక్షులు సాయి బాబా, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, బిజెపి కౌన్సిల్ మెంబర్ మాచర్ల శ్రీకాంత్, సీనియర్ నాయకులు, సాయగౌడ్, బిజెపి మండల నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ కిడ్నీతో కుమారుడికి పునర్జన్మ


**రామాయంపేట - 10మే (మహాప్రభ )**
తన ప్రాణమైన బిడ్డ కోసం ఆ మాతృమూర్తి తన ప్రాణాలకు తెగించి కిడ్నీ అవయవ దానం చేసింది రామాయంపేటకు చెందిన ఎర్రగొల్ల



సత్యనారాయణ 15 ఏళ్ల క్రితం కిడ్నీ వ్యాధి తో బాధపడుతూ చావు బతుకుల మధ్య ఉన్నతరణంలో, తల్లి మణెమ్మ తన కిడ్నీని దానం చేసి కొడుకును కాపాడుకుంది అమ్మ ఇచ్చిన కిడ్నీతో గత 15 ఏళ్లుగా తన ఆరోగ్యంగా ఉండాలని ఈ జన్మ ఆమె బిక్షేనని సత్యనారాయణ భావోద్వేగంతో తెలిపారు., నేడు మాతృ దినోత్స వం

# వివాహ వేడుకలో పాల్గొన్న యతిన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మెగావత్ రవి

**శివంపేట మే 10 (మహాప్రభ):**
శివంపేట్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో జరిగిన వివాహ వేడుకకు లింగోజిగూడ మాజీ సర్పంచ్, యతిన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మెగావత్ రవి నాయక్ హాజరయ్యారు. రూప్ల తాండాకు చెందిన



వంకడోత్ బుజ్జి గోవింద్ నాయక్ కుమార్తె అఖిలను, లింగోజిగూడ తాండాకు చెందిన మెగావత్ అమ్రీబాయి -- బాల్య నాయక్ కుమారుడు మోహన్ నాయక్‌కు వివాహం జరిపించారు. ఈ సందర్భంగా పెళ్లి వేడుకలో పాల్గొన్న మెగావత్ రవి నాయక్ నూతన వధూవరులను ఆశీర్వదించి, రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే వధూవరులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# వివాహానికి మున్సిపల్ చైర్మన్



**రామాయంపేట -10మే (మహాప్రభ )**
రామాయంపేట మున్సిపాలిటీ పరిధి 1 వ వార్డుకు చెందిన టాంక రి లక్ష్మి కీర్తిశేషులు రాజయ్య కూతురి వివాహమునకు మున్సిపల్ చైర్మన్ హాజరై పట్టుచీర పెట్టి నూతన వధూవరులను ఆశీర్వదించిన మున్సిపల్ చైర్మన్ గాజవాడ లావణ్య నాగరాజు గారు 7 వ . వార్డు కౌన్సిలర్ గాజవాడ నాగరాజు 9వ వార్డు కౌన్సిలర్ దేవుని రంజిత్. డిసిసి ఉపాధ్యక్షులు చింతల యాదగిరి. డిసిసి . కార్యదర్శి పోచమ్మల గణేష్ గారు కాంగ్రెస్ సీనియర్ నాయకులు దా కి స్వామి మరియు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగినది

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి..



**మెదక్ జిల్లా -10మే (మహాప్రభ )**
హవేలిఘనపూర్ మండలం గాజిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాప. సాయిలు కుమార్తె మౌనిక వివాహం విజయ్ కుమార్ తో ఆదివారం మెదక్ కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్ లో ఘనంగా జరిగింది.ఈ వివాహానికి హాజరై మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.వీరి వెంట హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి , సర్పంచ్ సాయిలు,మాజీ సర్పంచ్ యామి రెడ్డి, శంకరంపేట మండల పార్టీ అధ్యక్షులు పట్లోరి. రాజు నాయకులు సాప. శ్రీనివాస్, పోచయ్య,పడాల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# నూతన గృహప్రవేశానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు బండారి గంగాధర్



**శివంపేట, మే 10 (మహాప్రభ):**
శివంపేట్ మండల కొంతాను పల్లి గ్రామంలో పెద్దిపల్లి అంజయ్య, పెద్దిపల్లి శ్రీనివాస్ గారి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండారి గంగాధర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ రాజ్యం ద్వారా రూ.5 లక్షల సహాయంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవడం ఆనందకర విషయమన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సొంతింటి కల నెరవేరడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాహిత పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం గృహ యజమానులను అభినందించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి నాగరాజు, సానే ఆనంద్, పిల్లి మణికంఠ, మహేష్, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రంగంపేటలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**-ఆరుగురు పట్టివేత...నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం.**

**మెదక్ జిల్లా -10మే (మహాప్రభ )**
జూదం, అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవని మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. కుల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో రంగంపేట గ్రామ శివారులోని అవుసుల కుంట సమీపంలో పేకాట ఆడుతున్న వారిపై స్థానిక పోలీసులు మరియు టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు.



పట్టుబడిన వారు కొమ్ముల రాజాగౌడ్, ఉరేడి సత్యం, అరట్ల సురేష్, నిమ్మనగారి చంద్రారెడ్డి, ఎం.డి. చాంద్ పాషా, అరిగె నర్సింలుగా గుర్తించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.వారి వద్ద నుంచి రూ.4,050 నగదు, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని వెల్లడించారు.జిల్లాలో జూదం, పేకాట వంటి అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

# కొనుగోలు కేంద్రాల్లో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా.. రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదు..

**చేగుంట మండలం కర్ణాల్పల్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి హరీశ్ రావు..**



**మెదక్ జిల్లా -10మే (మహాప్రభ )**
మెదక్ జిల్లా చేగుంట మండలం కర్ణాల్పల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సందర్శించారు. ఆయనతో పాటు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గ మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రోజుల తరబడి పడిగాపులు కాస్తున్న రైతుల కష్టాలను, వానలకు తడిసిన వడ్లను పరిశీలించిన హరీశ్ రావు ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వడ్ల కొనుగోలు విషయంలో దారుణంగా ఫెయిల్ అయ్యింది. రాష్ట్రంలో రైతుల పరిస్థితి చాలా దయనీయంగా మారింది. కర్ణాల్పల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభించి 25 రోజులైంది. ఇప్పటివరకు కేవలం రెండే లారీలు వచ్చాయి.పది రోజులకు ఒక లారీ వస్తే ఈ వడ్లన్నీ ఎప్పుడు కొనాలి? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు వడ్లు తడిసి, మళ్లీ ఆరబెట్టినా కొనలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఏ గ్రామానికి పోయినా రైతులు కల్లాల్లో కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. రేవంత్ రెడ్డి ఇంతవరకు వడ్ల కొనుగోళ్లపై ఒక్క రోజైనా కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెట్టారా? మీ మంత్రులతో ఒక్క మీటింగ్ అయినా చేశారా? మీకు ఢిల్లీకి పోవడం, హైదరాబాద్ కు రావడం తప్ప వేరే పనే లేదా? ఢిల్లీకి వెళ్లి కప్పం కట్టడం తప్ప.. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతుల కష్టాలు ముఖ్యమంత్రికి, మంత్రులకు పట్టవా?మెదక్ జిల్లాలో ఇప్పటివరకు ఏ ఒక్క మంత్రి అయినా వడ్ల కొనుగోళ్లపై సమీక్ష చేశారా? ఈ ప్రభుత్వానికి రైతులంటే లెక్క లేదు, పట్టింపు లేదు, చిన్నచూపు ఉన్నందు వల్లే ఈ దుస్థితి దాపురించింది. ఏసీ రూముల్లో కూర్చుని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారు. ఆయన ఒకసారి పోలీసులను పక్కనపెట్టి రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు తిరిగితే రైతుల కన్నీళ్లు, కష్టాలు ఏంటో అర్థమవుతాయి. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆ పార్టీ సర్పంచులే ఇవాళ వడ్లు కొనాలని కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేస్తున్నారు. అంటే మీ ప్రభుత్వ పరిస్థితి ఎంత దయనీయంగా, దారుణంగా తయారైందో ఒకసారి అర్థం చేసుకోవాలి. ప్రతిపక్ష నాయకులు సోషల్ మీడియాలో ట్వీట్లు చేస్తే కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్న ముఖ్యమంత్రికి.. రైతుల బాధల గురించి ఇంటెలిజెన్స్, పోలీసులు నివేదికలు ఇవ్వడం లేదా? మక్కలు, శనగలు, సన్ ఫ్లవర్ అమ్మిన రైతులకు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా వేయలేదు. జొన్నల కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభమే కాలేదు. 35 రోజుల నుంచి సన్ ఫ్లవర్ కొనుగోళ్లు ఆగిపోయాయి. కుప్పల కింద ఆ పంటకు చెదలు పడుతున్నా ప్రభుత్వానికి కనికరం లేదు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లో జరిగిన అవినీతి వల్లే నేడు అది దివాలా తీసింది. ఆ సంస్థ ఎన్ పి ఎ కావడంతో బ్యాంకులు అప్పులివ్వడం లేదు. దాంతో దొడ్డిదారిన కోఆపరేటివ్ బ్యాంకు నుంచి మార్క్ ఫెడ్ కు, అక్కడి నుంచి సివిల్ సప్లైస్ కు డబ్బులు మళ్లించారు. మీ అవినీతి, తప్పులకు రైతులను బలిచేస్తున్నారు. రేషన్ షాపుల్లో ఏళ్ల తరబడి నిల్వ ఉన్న సుమారు రూ. 500 కోట్ల విలువైన దొడ్డు బియ్యం పురుగులు పట్టి ముక్కిపోయాయి. వాటిని అమ్మి రికవరీ చేయాలన్న కనీస సోయి, బాధ్యత కూడా ఈ ప్రభుత్వానికి లేదు. ముఖ్యంగా చేగుంట మండలంలోని 10 గ్రామాల్లో వడగండ్ల వాన వల్ల పంటలకు తీవ్ర నష్టం జరిగింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక వరుసగా మూడు యాసంగి సీజన్లలో రైతులు నష్టపోతూనే ఉన్నారు. ప్రభుత్వం తక్షణమే మేల్కొని లారీలు పంపించి, కాంటాలు పెట్టి వడ్లు కొనాలి. లేదంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులం అంతా కలెక్టరేట్లను ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం.

# గిరిజన తాండాల్లో యతిన్ ట్రస్ట్ మెగా హెల్త్ క్యాంప్..

**-200 మందికి ఉచిత వైద్య సేవలు**

**శివంపేట మే 10 (మహాప్రభ):**
మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని పిల్లికుంట్ల తాండా గ్రామ పంచాయతీ పరిధిలోని నాగోనికుంట తాండాలో యతిన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, బీపీ, షుగర్ పరీక్షలతో పాటు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పద్మ ధారాసింగ్ హాజరై మాట్లాడుతూ, యతిన్ ట్రస్ట్ సేవలు పల్లె పల్లెకు చేరువవుతూ గిరిజన తాండాల్లో ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. దూర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు వెళ్లలేని ప్రజలకు గ్రామంలోనే వైద్య సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. లింగోజిగూడ గ్రామానికి చెందిన యతిన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మెగావత్ రవి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందని ప్రజలకు సహాయం చేయాలనే లక్ష్యంతో ట్రస్ట్‌ను స్థాపించామని తెలిపారు. బీపీ, షుగర్ వంటి వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందించడం జరుగుతోందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి హెల్త్ క్యాంపులు నిర్వహించి మరింత మందికి సేవలు అందించాలనే లక్ష్యంతో





ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఈ హెల్త్ క్యాంప్‌లో సుమారు 200 మందికి పైగా గ్రామస్తులు వైద్య సేవలు పొందారు. ఫ్రీ మెడికల్ సేవలు, మందులు, ఫార్మసీ సదుపాయాలు కల్పించిన యతిన్ ట్రస్ట్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శారదా విట్టల్ శంకర్, గ్రామ నాయకులు, వైద్య సిబ్బంది, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# మదర్స్ డే సందర్భంగా మాతృమూర్తులకు ఘన సన్మానం

**కరీంనగర్, మే 10 (మహాప్రభ)**
లయన్స్ ఇంటర్నేషనల్ 320జి రీజియన్ టూ 2026--27 సంవత్సర కాలానికి పిఎస్టీల ప్రత్యేక సమావేశం కరీంనగర్ శ్రీనిధి చిట్‌ఫండ్ సమావేశ మందిరంలో రీజనల్ చైర్‌పర్సన్ రాళ్లబండి శంకర ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.ఈ



సమావేశంలో క్లబ్బుల అభివృద్ధి, సభ్యత్వం పెంపు, సేవా కార్యక్రమాలపై చర్చ జరిగింది. రీజియన్ సెక్రటరీ నరహరి లక్ష్మారెడ్డి, జోన్ సెక్రటరీలు శంకర్, శరత్, రాజశేఖర్, లయన్స్ జిల్లా పెద్దలు సిహెచ్, సుదీర్‌రావు, పుల్లూరి ప్రభాకర్, రమేష్, వెంకటేశ్వర్లు, వివిధ క్లబ్బుల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అంతర్జాతీయ మదర్స్ డే సందర్భంగా రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాతృమూర్తులను ఘనంగా సన్మానించారు.మదర్స్ డే వేడుకల్లో మాతృమూర్తుల గౌరవం ప్రతిష్టాత్మకంగా నిలిచింది.

# బస్టాండ్‌లో చలివేంద్రం నీళ్లు కలుషితం చేస్తున్న కోతులు

**శివంపేట, మే 10 (మహాప్రభ)**
శివంపేట్ మండలంలోని చిన్న గొట్టిముక్కుల గ్రామ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో కోతుల బెడద తీవ్రంగా మారింది. చలివేంద్రం వద్దకు వచ్చే కోతులు నీటిని తాగడంతో పాటు పాత్రలను ఖరాబ్ చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు తరిమినా కోతులు మళ్లీ వచ్చి నీటిని కలుషితం చేస్తున్నాయని తెలిపారు. అదే నీటిని తెలియక



ప్రజలు తాగుతున్న పరిస్థితి ఉందని, దీనివల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత నిర్వాహకులు స్పందించి చలివేంద్రం వద్ద రక్షణ చర్యలు చేపట్టి, ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## బిజినెస్

### ఉద్యోగుల అవినీతి..
### మూడేళ్లలో వెయ్యి మందిని తొలగించిన ఎయిరిండియా..




గత మూడు సంవత్సరాల్లో ఎయిరిండియా 1,000 మందికి పైగా ఉద్యోగులను విధుల నుంచి తొలగించినట్లు సంస్థ సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ వెల్లడించారు. నైతిక ఉల్లంఘనలు, ఉద్యోగ ప్రయోజనాల దుర్వినియోగం, అక్రమ చర్యల్లో పాల్గొన్నారనే కారణాలతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇటీవల ముంబైలో జరిగిన టౌన్‌హాల్ మీటింగ్‌లో సీఈవో క్యాంప్‌బెల్ ఈ విషయాన్ని వెల్లడించారు.కొందరు ఉద్యోగులు అదనపు లగేజీకి చార్జీలు లేకుండా అనుమతించడం, విమానాల నుంచి వస్తువులను అక్రమంగా తరలించడం వంటి చర్యలకు పాల్పడ్డారని క్యాంప్‌బెల్ పేర్కొన్నారు. ఎంప్లాయి లీజర్ ట్రావెల్ పాలసీని కూడా వందలాది మంది ఉద్యోగులు దుర్వినియోగం చేశారని తెలిపారు. ఎవరూ చూడకపోయినా సరైన విధంగా వ్యవహరించడం ఉద్యోగుల బాధ్యతన్నారు. సంస్థలో ప్రతి సంవత్సరం వందలాది మంది ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు . పశ్చిమాసియాలో పరిస్థితులు చక్కబడకపోతే ఈ ఏడాది కూడా కఠిన పరిస్థితులు తప్పవని అన్నారు . టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిరిండియాలో ప్రస్తుతం సుమారు 24,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఆర్థిక ఒత్తిళ్లు, పెరుగుతున్న ఖర్చులు, అంతర్జాతీయ విమానయాన రంగంలోని సవాళ్ల మధ్య సంస్థ ఖర్చు నియంత్రణ చర్యలను కఠినతరం చేసినట్లు సమాచారం.

### బంగారం కొనే వారికి గుడ్‌న్యూస్..
## మళ్లీ తగ్గిన పసిడి ధరలు.. తులం ఎంతంటే?

గత కొన్ని రోజులుగా ఉరుకులు పెడుతున్న బంగారం, వెండి ధరలకు సడెన్ బ్రేకులు పడ్డాయి. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,52,235 వద్ద కొనసాగుతుండగా 22 క్యారెట్ల ధర రూ.1,39,650 వద్ద ట్రేడవుతుంది. వెండి ధరలు కూడా అదే బాటలో పయనిస్తూ కిలోకు రూ. 2,62,350 వద్ద స్థిరంగా ఉన్నాయి. ఇక హైదరాబాద్, విజయవాడ, విశాఖ పట్నం సహా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

**దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు**

హైదరాబాద్‌లో బంగారం 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,52,350, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,650 ఉంది. వెండి కిలో ధర రూ.2,62,350గా ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,52,350, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,650 ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,53,010, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర



రూ.1,40,260 ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,52,350,, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,650 ఉంది.

కోల్‌కత్తాలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,52,350, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,650 ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,54,370,గా ఉండగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,41,500గా ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,52,500, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ1,39,800 వద్ద కొనసాగుతుంది.

మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ వాతావరణం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెట్టుబడిదారులను బంగారం వైపు మళ్ళిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న వస్తువుల ధరలు, కరెన్సీ విలువ తగ్గడం వంటి కారణాల వల్ల సురక్షితమైన పెట్టుబడిగా బంగారానికి డిమాండ్ పెరుగుతోంది. అయితే పశ్చిమాసియా ఉద్రిక్తల నేపథ్యంలో ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగాయి. అయితే ఆయిల్ రేట్స్ పెరిగినప్పుడు సాధారణంగా బంగారం ధరలు కూడా ప్రభావితమవుతాయి. కాబట్టి నిపుణుల ప్రకారం, రాబోయే రోజుల్లో 10 గ్రాముల బంగారం ధర రూ. 2 లక్షల మార్కును కూడా తాకవచ్చని చెబుతున్నారు. అయితే మీరు నగలు చేయించుకోవాలనుకుంటే, ధర కొంచెం తగ్గినప్పుడు కొనడం మంచిది. అదే పెట్టుబడి కోసం అయితే, దీర్ఘకాలికంగా 5-10 ఏళ్లు బంగారం ఎప్పుడూ లాభదాయకమే.

## సీబీ 1000 హార్నెట్ ఎస్పీ బైకుల రీకాల్

**న్యూఢిల్లీ, మే 9**

హోండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియాకు చెందిన సీబీ 1000 హార్నెట్ ఎస్పీ మోటర్‌సైకిళ్లను రీకాల్ చేస్తున్నట్టు ప్రకటించింది. చమురు పైపునకు సంబంధించి రెండు రకాల టెక్నికల్ సమస్యలు తలెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నది.సెప్టెంబర్ 30, 2024 నుంచి ఆగస్టు 22, 2025లోపు తయారైన ఈ మోటర్‌సైకిళ్లలో రెండు సాంకేతిక సమస్యలు గుర్తించినట్టు, దీంట్లో ఇంధన సరఫరా గొట్టం అమరికకు సంబంధించనదని, నిర్దిష్ట పరిస్థితుల్లో ఆ పైపు సరిగ్గా బిగించబడి ఉండేలా నిర్ధారించుకోవడానికి తనిఖీ అవసరమని గుర్తించి వెంటనే ఈ బైకులను వెనక్కి పిలిపించినట్టు తెలిపింది.



### చెపాక్‌లో ఉర్విల్ ఊచకోత..
## ఎనిమిదో ఓటమితో లక్నో ఔట్..!

లీగ్ దశ ఆఖర్లో గొప్పగా ఆడుతున్న సొంతగడ్డపై చెన్నై సూపర్ కింగ్స్ .. భారీ లక్ష్యాన్ని ఉఫ్‌మనిపించింది. చెపాక్‌లో ఉర్విల్ పటేల్(65) రికార్డు అర్ధ శతకంతో మెరవగా.. లక్నో సూపర్ జెయింట్స్ పై సీఎస్కే 5 వికెట్లతో జయభేరి మోగించింది. 204 పరుగుల ఛేదనలో లక్నో బౌలర్ల భరతం పట్టిన ఉర్విల్.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(42)తో గెలుపు తోవలో నడిపాడు. కానీ.. మిడిల్ ఓవర్లలో షాదాబ్, దిగ్వేశ్ రథీల విజృంభణతో మ్యాచ్ లక్నోవైపు మళ్లింది. కానీ, డెత్ ఓవర్లలో ఇంప్యాక్ట్ సబ్ ప్రశాంత్ వీర్(18 నాటౌట్), శివం దూబే(15 నాటౌట్)లు కళ్లుచెదిరే సిక్సర్లతో లక్నో ఆశల్ని ఆడియాసలు చేశారు.పసుపు జెర్సీలతో నిండిపోయిన చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ విజయ గర్జన చేసింది. బౌలర్లు ప్రత్యర్థికి భారీ స్కోర్ సమర్పించిన చోట.. కుర్రాడు ఉర్విల్ పటేల్(65 : 23 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా విరుచుకుపడగా లక్నో బౌలర్లు బెంబేలెత్తిపోయారు. ఆఖర్లో ఉత్కంఠ నెలకొన్నప్పటికీ.. డెత్ ఓవర్లలో ఇంప్యాక్ట్ సబ్ ప్రశాంత్ వీర్(18 నాటౌట్), శివం దూబే(15 నాటౌట్)లు ఒత్తిడికి లోన్వకుండా చెన్నైకి 5 వికెట్ల విజయాన్ని కట్టబెట్టారు. ఆరో విక్టరీతో 12 పాయింట్లు సాధించిన చెన్నై.. టాప్-5లో నిలిచింది. 11 మ్యాచుల్లో ఎనిమిదింటా ఓడిన లక్నో ప్లే ఆఫ్స్ రేసు నుంచి వైదొలిగింది.లక్నో నిర్దేశించిన భారీ ఛేదనను ఓపెనర్ శాంసన్(28)ను ధాటిగా



ఆరంభించాడు. బౌండరీలో చెలరేగిన సంజూను దిగ్వేశ్ రథీ బౌల్డ్ చేసి తొలి వికెట్ అందించాడు. అవేశ్ ఖాన్‌ను వణికించిన ఉర్విల్ పటేల్(65) చివరి మూడు బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపగా 5 ఓవర్లకే చెన్నై స్కోర్ డెబ్బై దాటింది. ఆ తర్వాతి ఓవర్లో దిగ్వేష్‌ను వదలని ఉర్విల్.. మూడు సిక్సర్లు, ఒక ఫోర్‌తో స్టేడియాన్ని హోరెత్తించాడు. వరసగా రెండు ఓవర్లలో 25 చొప్పున రన్స్ రావడంతో పవర్ ప్లేలో సీఎస్కే వికెట్ నష్టానికి 97 పరుగులు చేసింది.

పవర్ ప్లే తర్వాత సింగిల్‌తో 13 బంతుల్లోనే ఉర్విల్ అర్ధ శతకంతో రికార్డు నెలకొల్పాడు. ఆదే ఊపులో.. ఆడిన అతడు.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(42)తో చెన్నైని గెలుపు దిశగా నడిపాడు. షాదాబ్ ఓవర్లో అవేశ్ చేతికి చిక్కడంతో ఉర్విల్ తుఫాన్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. అప్పటికే సగం లక్ష్యం కరిగిపోవడంతో చెన్నైకి భారీ విజయం పక్కా అనిపించింది. కానీ, షాదాబ్ ఓవర్లో గైక్వాడ్ బౌల్డవ్వగా.. బ్రెవిస్(10)ను రథీ బౌల్డ్ చేశాడు. ఫామ్‌లో ఉన్న కార్తిక్ శర్మ(20)ను అవేశ్ పెవిలియన్ పంపడంతో ఇంప్యాక్ట్ సబ్‌గా ప్రశాంత్ వీర్(18 నాటౌట్) వచ్చాడు. 18 బంతుల్లో 30 రన్స్ అవసరమవ్వగా.. ప్రిన్స్ 9 రన్సే ఇవ్వడంతో ఉత్కంఠ మొదలైంది. రథీ, పూరన్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన ప్రశాంత్ రెండు సిక్సర్లతో మెరవగా.. మర్క్‌రమ్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో శివం దూబే(15 నాటౌట్) తొలి రెండు బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపాడు. దాంతో 5 వికెట్లతో గెలుపొందిన సీఎస్కే 12 పాయింట్లతో ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది.


**రెచ్చిపోయిన ఇంగ్లిస్**

పంతొమ్మిదో సీజన్‌లో ప్లే ఆఫ్స్ రేసులో లేని లక్నో సూపర్ జెయింట్స్ భారీ స్కోర్ కొట్టింది. ఓపెనర్ జోష్ ఇంగ్లిస్(85) అర్ధ శతకంతో భారీ స్కోర్‌కు పునాది వేశాడు. కానీ, ఓవర్టన్(3-36), అన్షుల్ కంబోజ్(2-47)లు వికెట్ల వేటతో మిడిలార్డర్‌కు బ్రేకులు వేశారు. షాదాబ్ అహ్మద్(43 నాటౌట్), హిమ్మత్ సింగ్(17) డెత్ ఓవర్లలో ధనాధన్ ఆడి స్కోర్ రెండొందలు దాటించారు. ఒకదశలో 230 ప్లస్ కొట్టేలా కనిపించినా చివరకు వీరిద్దరి కృషి ఫలితంగా లక్నో 203కు పరిమితమైంది.

**జోష్ ఇంగ్లిస్(85)**

### ఐపీఎల్‌లో సంచలనం..
## రికార్డు హాఫ్ సెంచరీ బాదిన అన్‌క్యాప్డ్ ప్లేయర్..!

ఐపీఎల్‌లో అన్‌క్యాప్డ్ ప్లేయర్ ఉర్విల్ పటేల్ చరిత్ర సృష్టించాడు. పంతొమ్మిదో సీజన్‌లో తొలిసారి బ్యాట్ ఝులిపించిన ఈ చెన్నై చిన్నోడు రికార్డు అర్ధ శతకంతో రికార్డు నెలకొల్పాడు. చెపాక్ స్టేడియంలో పూనకం వచ్చినట్టే ఆడిన ఉర్విల్.. ఏకంగా 13 బంతుల్లోనే యాభై రన్స్‌తో చెలరేగాడు. తద్వారా ఈ మెగా టోర్నీ చరిత్రలో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీతో యశస్వీ జైస్వాల్ రికార్డను సమం చేశాడీ హిట్టర్.చెపాక్ స్టేడియంలో సిక్సర్ల వర్షం కురిపించాడు ఉర్విల్ పటేల్. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లను ఊచకోత కోసిన ఉర్విల్.. ఎదుర్కొన్న ఎనిమి ది బంతులను.. 1, 6, 6, 6, 6, 4, 6 గా మలిచి అర్ధ శతకానికి చేరువయ్యాడు. అవేశ్ ఖాన్, దిగ్వేజ్ రథీ బౌలింగ్‌ను తుత్తునియలు చేసిన ఉర్విల్.. షమీ,



షాదాబ్‌ను ఉతికేస్తూ 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీతో చరిత్ర లిఖించాడు.కోల్‌కతా నైట్ రైడర్స్ పై 2023లో యశస్వీ జైస్వాల్ నెలకొల్పిన వేగవంతమైన ఫిఫ్టీ రికార్డును ఉర్విల్ సమం చేశాడు. కమిన్స్, కేఎల్ రాహుల్, రొమారియో షెపర్డ్ 14 బంతుల్లో అర్ధ శతకంతో ఆ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు

**ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ వీళ్లే..**

యశస్వీ జైస్వాల్ (రాజస్థాన్ రాయల్స్)- 13 బంతుల్లో -- కోల్‌కతాపై 2023లో.

ఉర్విల్ పటేల్ (చెన్నై సూపర్ కింగ్స్) -- 13 బంతుల్లో -- లక్నోపై 2026లో.


కేఎల్ రాహుల్(పంజాబ్ కింగ్స్) -- 14 బంతుల్లో -- ఢిల్లీ క్యాపిటల్స్‌పై 2018లో.

ప్యాట్ కమిన్స్(కోల్‌కతా నైట్ రైడర్స్) -- 14 బంతుల్లో ముంబై ఇండియన్స్‌పై 2022లో.

రొమారియో షెపర్డ్(ఆర్సీబీ)- 14 బంతుల్లో -- చెన్నై సూపర్ కింగ్స్‌పై 2025లో .

## స్పోర్ట్స్

### సీనియర్లకే మరో ఛాన్స్..
### ఇద్దరు పేసర్లతో ప్రపంచకప్ స్క్వాడ్..!



మహిళల టీ20 ప్రపంచకప్ సమీపిస్తున్నందున బంగ్లాదేశ్ బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. నిగర్ సుల్తానా కెప్టెన్‌గా పదిహేను మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేసింది. గత ఎడిషన్ స్క్వాడ్‌లోని 11 మందికి మళ్లీ చోటు దక్కగా.. సీనియర్ షర్మీన్ సుల్తానా స్థానంలో టాపార్డర్ బ్యాటర్ తేజ్ నెహర్‌కు సెలెక్టర్లు అవకాశమ ఇచ్చారు. అయితే.. అందర్నీ ఆశ్చర్య పరుస్తూ ఈ ఐసీసీ ఈవెంట్‌లో ఇద్దరు పేసర్లతోనే బంగ్లా జట్టు ఆడనుంది.అంతర్జాతీయ క్రికెట్‌లో పొట్టి ప్రపంచకప్ పండుగకు బంగ్లాదేశ్ మహిళల జట్టు సిద్ధమవుతోంది. స్క్వాడ్ ఎంపిక అనంతరం చీఫ్ సెలెక్టర్ సజాద్ అహ్మద్ మాట్లాడుతూ ఇద్దరు పేసర్లను మాత్రమే తీసుకోవడంపై వివరణ ఇచ్చాడు. 'బంగ్లాదేశ్ బృందంలో ఇద్దరు పేసర్లు ఉండడానికి కారణం పేసర్లు త్వరగా గాయపడుతారు. పైగా ఇంగ్లండ్‌లో వికెట్ ఒకప్పటిలా పేస్‌కు కాకుండా ఉపఖండం మాదిరిగా ఉంటుందని తెలిసింది. అంటే.. స్పిన్నర్లకు అనుకూలిస్తాయి.

సో.. అందుకే స్పిన్నర్లపై నమ్మకం ఉంచాం. వన్డేల్లో రాణిస్తున్న షర్మీన్ సుల్తానా బదులు తేజ్ నెహర్‌ను ఎంపిక చేయడానికి కారణముంది. నెహర్ వైవిధ్యమైన ప్లేయర్. ఆమె ఓపెనింగ్ నుంచి ఆరో స్థానంలో ఎక్కడైనా ఆడగల సమర్థురాలు. డెత్ ఓవర్లలో తను గొప్పగా ఆడగలదు' అని సజాద్ వెల్లడించాడు. అంతేకాదు ఫార్మాట్‌కు తగ్గట్టుగా దూకుడైన ఆట ఆడేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నాడు.

'బంగ్లాదేశ్ జట్టు డిఫెన్స్ స్టయిల్ బ్యాటింగ్ అతిపెద్ద సమస్యగా మారింది. ఒక్కరాత్రిలోనే అంతా మారిపోతుందని నేను చెప్పను. కానీ, ఈ సమస్యను పరిష్కరించేందుకు సెలెక్టర్లు ప్రయత్నిస్తున్నారు' అని సజాద్ తెలిపాడు. టాపార్డర్‌లో నిగర్ సుల్తానా, షర్మీన్ అక్తర్, శోభనా మొస్త్రే, తేజ్ నెహర్ కీలకం కానున్నారు. నిరుడు భారత్, శ్రీలంక ఆతిథ్యమిచ్చిన వన్డే వరల్డ్‌కప్‌లో మెరిసిన యువ పేసర్ మరుఫా అక్తర్‌తో పాటు ఫరిహా ఇస్లాం కొత్త బంతిని పంచుకోనుంది. వరల్డ్‌కప్ సన్నాహకాల్లో భాగంగా నెదర్లాండ్స్, స్కాట్లాండ్‌తో ముక్కోణపు సిరీస్ ఆడనుంది. ఇంగ్లండ్ వేదికగా జూన్12 నుంచి పొట్టి ప్రపంచకప్ మొదలవ్వనుంది.

**బంగ్లాదేశ్ ప్రపంచకప్ స్క్వాడ్ :** నిగర్ సుల్తానా జోటీ(కెప్టెన్), నహిదా అక్తర్(వైస్ కెప్టెన్), షర్మీన్ అక్తర్, శోభనా మొస్త్రే, షోర్నా అక్తర్, రీతు మోని, రబేయ ఖాన్, పాహిమా ఖాతూన్, ఫరీహ ఇస్లాం, మరుఫా అక్తర్, షాంజిద అక్తర్, సుల్తానా ఖాతున్, దిలరా అక్తర్, జుయైరియా ఫిర్దౌస్, తాజ్ నెహర్.



## అబ్బా అనిపించేలా నభా నటేష్ అందాలు..

# వీరభద్రుడి దుష్టశిక్షణ



సూర్య కథానాయకుడిగా నటిస్తున్న తమిళ చిత్రం 'కరుప్పు'.. 'వీరభద్రుడు' పేరుతో తెలుగులో అనువాదమవుతున్నది. ఆర్జే బాలాజీ దర్శకుడు. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నది. ఈ చిత్రంలో సామాన్యుల తరపున పోరాటం చేసే న్యాయవాది పాత్రలో సూర్య కనిపించనున్నారు. సామాజిక అంశాలతో పాటు డివోషనల్ టచ్‌తో కూడుకున్న ఈ కాన్సెప్ట్‌లో థ్రిల్లింగ్ అంశాలుంటాయని మేకర్స్ చెబుతున్నారు.వీరభద్రుడిగా సూర్య నట విశ్వరూపం ప్రదర్శించాడని, దుష్ట శిక్షణ కోసం ఆయన ఎలాంటి మార్గాన్ని అనుసరించాడన్నది ఆసక్తికరంగా ఉంటుందని, యాక్షన్ సీక్వెన్సెస్ ప్రధానాకర్షణగా నిలుస్తాయని చెబుతున్నారు. త్రిష, ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ, మాయ రవి, సుప్రీత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సాయిఅభ్యంకర్, నిర్మాతలు: ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు, రచన-దర్శకత్వం: ఆర్జే బాలాజీ.


# హాట్ టాపిక్‌గా కృతిసనన్ కామెంట్స్



### హీరోయిన్ల పారితోషికం తగ్గించడంపైనే ఫోకస్..

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అక్కర్లేని భామ కృతిసనన్. తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా టాలీవుడ్‌లో ఈ భామకున్న ఫ్యాన్ బేస్ ఎక్కువే అని చెప్పాలి. చాలా కాలంగా హిందీ సినిమాలకే పరిమితమైన ఈ ముద్దుగుమ్మ కాస్ట్ కటింగ్ కారణంగా హీరోయిన్లు ఎలా ప్రభావితం అవుతున్నారో చెప్పుకొచ్చింది కృతిసనన్. బడ్జెట్ నియంత్రణలో భాగంగా నిర్మాతలు మొదట హీరోయిన్ల పారితోషికం తగ్గించడంపైనే ఫోకస్ పెడుతున్నారని తాజాగా ఓ చర్చ నెట్టింట కొనసాగుతుంది.ఈ విషయమై కృతిసనన్ మాట్లాడుతూ.. మధ్య శ్రేణి (మిడ్ రేంజ్ హీరోయిన్లు) రెమ్యునరేషన్లను నిర్మాతలు పున: పరిశీలిస్తున్నారంది. అయితే ఇండస్ట్రీలో స్టార్ హీరోలకు ఇచ్చే భారీ రెమ్యునరేషన్లపై ఇప్పటికీ అతి తక్కువ స్థాయిలో చర్చ నడుస్తుందని చెప్పింది.కాస్ట్ కటింగ్ ఎఫెక్ట్ ప్రధానంగా హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులపైనే పడుతుందని అభిప్రాయపడ్డింది. అదే సమయంలో కేవలం టాప్ హీరోల రెమ్యునరేషన్లు తగ్గించుకుంటేనే మార్పు మొదలవుతుందని ఓ వర్గానికి చెందిన దర్శకనిర్మాతలు నమ్ముతున్నారని చెప్పుకొచ్చింది. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.ఇదిలా ఉంటే బ్యాక్ టు బ్యాక్ బాక్సాఫీస్ ఫెయిల్యూర్స్ కారణంగా, థియాట్రికల్ రెవెన్యూ పడిపోవడం కారణంగా నిర్మాతలు ప్రొడక్షన్ ఖర్చులను తగ్గించుకోవాలని చూస్తున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్.

# జీవితం ఓ కలలా ఉంది..



తల్లిగా మారిన తర్వాత జీవితం ఓ కలలా సాగుతున్నదని అంటున్నది బాలీవుడ్ స్టార్ సోనమ్ కపూర్. తన పిల్లలతో గడుపుతున్న మధుర క్షణాలను ఇటీవల సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంది. రెండోసారి మగబిడ్డకు జన్మనిచ్చిన సోనమ్.. తన పిల్లల ఫొటోలను ఇన్‌స్టాలో షేర్ చేసింది. ఈ చిత్రాలు అభిమానులతోపాటు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఊయలలో నిద్రపోతున్న తన తమ్ముణ్ని.. సోనమ్ పెద్ద కొడుకు వాయు ఎంతో ఎగ్జయిటింగ్‌గా చూస్తున్న ఫొటోలు తెగ వైరల్ అవుతున్నాయి. ఫొటోలతోపాటు.. తన మాతృత్వపు అనుభూతులు, అనుభవాల గురించీ పంచుకున్నది సోనమ్. 'జీవితం ఒక కలలా ఉంది.ఈ నెల ఎంతో అద్భుతంగా గడిచింది. థ్యాంక్యూ యూనివర్స్' అంటూ రాసుకొచ్చింది. పిల్లల గోప్యతను గౌరవిస్తూ.. వారి ముఖాలు కనిపించకుండా జాగ్రత్త పడింది. ఈ పోస్టుకు అభిమానులతోపాటు తోటి నటీనటులు కూడా కామెంట్లు పెడుతున్నారు. సోనమ్ భర్త ఆనంద్ స్పందిస్తూ.. 'నేను ఈ పోస్ట్‌ను ఒక్కసారి కంటే ఎక్కువసార్లు లైక్ చేయడం ఎలా?' అంటూ సరదాగా కామెంట్ చేశాడు. ఆమె సోదరి రియా కపూర్.. హార్ట్ ఎమోజీలతో తన ప్రేమను చూపించింది.బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ నట వారసురాలిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది సోనమ్ కపూర్. మొదట్లో దిగ్గజ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ దగ్గర అసిస్టెంట్‌గా పనిచేసింది. 2007లో భన్సాలీ దర్శకత్వంలోనే వచ్చిన సావరియా చిత్రంతో హీరోయిన్‌గా తెరంగేట్రం చేసింది.

# లగాన్ డైరెక్టర్‌తో సినిమా



బాలీవుడ్ క్లాసిక్స్‌లో అమీర్‌ఖాన్ 'లగాన్' చిత్రం ముందు వరుసలో ఉంటుంది. ఈ స్పోర్ట్స్ డ్రామాకు ఇప్పటికీ అభిమానులున్నారు. దేశవ్యాప్తంగా అశేష ప్రేక్షకుల మన్ననలందుకున్న ఈ చిత్రానికి అశుతోష్ గోవారికర్ దర్శకుడు. ఈ దిగ్దర్శకుడు ఇన్నాళ్లకు మళ్లీ అమీర్‌ఖాన్‌తో సినిమా చేయనున్నట్టు బీటౌన్‌లో టాక్ వినిపిస్తున్నది. ఈసారి కూడా క్రికెట్ నేపథ్య కథతోనే సినిమా చేయనున్నట్టు సమాచారం.ప్రముఖ క్రికెటర్ లాలా అమర్‌నాథ్ జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కించనున్నట్టు తెలిసింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో జరిగే కథ ఇదని, 'లగాన్' మాదిరిగా ఇది కూడా పీరియాడిక్ నేపథ్యంతో సాగుతుందని సినీవర్గాల చెబుతున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సివుంది

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com